ప్రజాశక్తి
శనివారం 22 జూన్ 2024
8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఈపురుపాలెంలో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబసభ్యులు గాలించారు. రైలు పట్టాల పక్కన గర్ల్స్ హైస్కూల్ గోడ పక్కన పొదల్లో సుచరిత మృతదేహం వివస్త్రగా ఉంది. ఆమె ఒంటిపై గాయాలున్నాయి. ముక్కు నుంచి రక్తం కారుతోంది. కుటుంబ సభ్యులు, బంధువుల వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. యువతిపై అత్యాచారం చేసి.. హత్య చేశారన్న ప్రచారం మీడియా ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి.. హోం మంత్రి అనితను వెంటనే ఘటనాస్థలానికి వెళ్లాలని ఆదేశించారు. పోలీసు ఉన్నతాధికారులతోనూ ఈ ఘటనపై చర్చించి.. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

48 గంటల్లో అరెస్టు చేస్తాం..
హోం మంత్రి వంగలపూడి అనిత

ఈపురుపాలెంలో యువతిపై అత్యాచారం, హత్య ఘటన జరగడం చాలా దురదృష్టకరమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం గ్రామంలో రాష్ట్ర హోంమంత్రి అనిత శుక్రవారం పర్యటించారు. జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యతో కలిసి మంత్రి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. తదుపరి హత్యకు గురైన యువతి మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబీకులను ఓదార్చారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాపట్లకు చేరుకుని కలెక్టరేట్‌ను మంత్రి పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెక్కు రూపంలో శాసనసభ్యులకు మంత్రి అందజేశారు. తక్షణమే బాధితులకు అందివ్వాలని ఆమె కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి అనిత చెప్పారు. యువతిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను 48 గంటల్లో పట్టుకుంటామని మంత్రి చెప్పారు. ఐదు ప్రత్యేక టీములను నియమించామన్నారు. నిందితులు గంజాయి, మాదకద్రవ్యాలు తీసుకోవడంతోనే ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడ్డారనే అంశంపై విచారణ చేస్తున్నామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికడతామని స్పష్టం చేశారు. తక్షణమే నార్కోటిక్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. సంఘటనా పూర్వాపరాలపై జిల్లా కలెక్టర్, ఐజి, ఎస్పీలతో మాట్లాడామన్నారు. చీరాల సమీపంలోని సముద్ర తీరంలో యువకుల గల్లంతు బాధాకరమని, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి వెంట జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున చెక్కు అందజేస్తున్న చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

చీరాల మండలం ఈపురుపాలెం సీతారాంపేటలో శుక్రవారం అత్యాచారం, హత్యకు గురైన యువతి సుచరిత తల్లిదండ్రులను చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య పరామర్శించారు. యువతి తల్లి కామాక్షికి రాష్ట ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చెక్కును అందజేశారు.

సముద్రతీరంలో విషాదం

- ఈతకు వెళ్లి నలుగురు గల్లంతు
- ఇద్దరు దుర్మరణం
- మరో ఇద్దరి కోసం గాలింపు

ప్రజాశక్తి-చీరాల

వేటపాలెం మండలం, రామాపురం బీచ్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు ఏలూరు నుంచి 11 విద్యార్థులు కలిసి రాగా వీరిలో నలుగురు గల్లంతయ్యారు. నలుగురిలో ఇద్దరు మృతదేహాలు ఒడ్డుకు రాగా.. మరో ఇద్దరి కోసం పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో గాలిస్తున్నారు. ఏలూరు జిల్లా, దుగ్గిరాలకి చెందిన 11 మంది యువకులు సరదాగా గడిపేందుకు రామాపురం సముద్రతీరానికి శుక్రవారం వచ్చారు. తీరంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి ఇద్దరు యువకులు కొట్టుకుపోతుండగా.. వారిని కాపాడేందుకు మరో ఇద్దరు ప్రయత్నం చేశారు. అయితే వారు కూడా గల్లంతయ్యారు. కొద్దిసేపటికే తేజ (26), కిషోర్ (25) మతదేహాలు ఒడ్డుకు కొట్టకురాగా మరో ఇద్దరు యువకులు నితిన్, అమలరాజు ఆచూకీ తెలియలేదు. పరిస్థితి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించా రు. మృతదేహాలను పోలీసులు పరిశీలించి గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో జరిగిన ఘటన గురించి మృతుల బంధువులకు సమాచారం తెలియజేస్తూ తోటి స్నేహితులు సంఘటనా స్థలంలో బోరున విలపించారు.



ఒడ్డుకు కొట్టుకు వచ్చిన తేజ, కిషోర్ మృతదేహాలు

సమాచారం అడిగితే కేసులు పెడతారా?

- వైసీపీ మత్తు ఇంకా వీడలేదా?
- నిధుల గోల్‌మాల్ లెక్క చెప్పాల్సిందే!

ప్రజాశక్తి-తర్లుపాడు: పంచాయతీ నిధులు గూర్చి సమాచారం అడిగితే కేసులు పెడతారా అంటూ తర్లుపాడు పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావును టిడిపి నాయకులు నిలదీశారు. ఇంకా వైసిపి మత్తులోనే ఉన్నావా అంటూ మండిపడ్డారు. తర్లుపాడు గ్రామ పంచాయతీకి సంబంధించిన 25 లక్షల రూపాయల నిధులు గోల్‌మాల్ విషయంపై ఒక విలేఖరి సమాచారం అడిగితే అతనిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తావా? నీ ఇష్టం వచ్చినట్లు నిధులు దుర్వినియోగం చేసి వైసిపి నాయకులతో కుమ్మక్కై, ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోవాలా అంటూ మార్కాపురం నియోజకవర్గ టిడిపి యువ నాయకులు కందుల రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు పంచాయతీ కార్యదర్శిపై ప్రశ్నల వర్షం కురిపించారు. తర్లుపాడులో ఏ ఒక్క అభివృద్ధి, పారిశుధ్య పనులు చేయకుండా, వివిధ సాకులతో 25 లక్షల రూపాయలు దుర్వినియోగం చేసి, మరలా బెదిరింపులకు గురిచేస్తావా అంటూ పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు మేకల వెంకట్ యాదవ్, జనసేన వెలుగు కాశీరావు, ఖాదర్ బాషా (ఖైరు), ఈర్ల పెద్ద కాశయ్య, కాలంగి చిన్న శ్రీనివాసులు, ఈర్ల శ్రీనివాసులు, షేక్ అఫ్రోజ్, గంగాధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి

శనివారం 22 జూన్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఈపురుపాలెంలో ఘోరం

- యువతిపై అత్యాచారం.? హత్య..
- 48 గంటల్లో నిందితులను అరెస్టు చేస్తాం
- రాష్ట్ర హోంమంత్రి అనిత
- యువతి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం



యువతి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న హోంమంత్రి అనిత



సుచరిత (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా, చీరాల

చీరాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈపూరుపాలెంలో ఘోరం జరిగింది. శుక్రవారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన యువతి హత్యకు గురైంది. ఆమె మృతదేహంపై దుస్తులు లేకుండా ఉండటం, ఒంటిపై గాయాలు కూడా ఉండటంతో గ్యాంగ్ రేప్ జరిగి ఉంటుందని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. ఈ ఘటనపై సిఎం చంద్రబాబు వెంటనే స్పందించారు. ఘటనా స్థలానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను వెంటనే పంపారు. యువతి మృతదేహాన్ని హోం మంత్రి అనిత సందర్శించారు. యువతి కుటుంబాన్ని పరామర్శించారు. నిందితులను 48 గంటల్లో అరెస్టు చేస్తామన్నారు.

ఈపురుపాలెం గ్రామంలోని చేనేత కుటుంబానికి చెందిన సీతారాంపేటకు చెందిన పౌజుల వెంకటేశ్వర్లు, కామాక్షి దంపతుల పెద్ద కుమార్తె పౌజుల సుచరిత(21) ఇంటర్ చదివింది. ఇంటి వద్దే టైలరింగ్ పనిచేస్తోంది. శుక్రవారం వేకువజామున సుమారు 5.30 గంటల సమయంలో ఎప్పటిలాగే బహిర్భూమికి వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ▶ 2లో



కిషోర్ (ఫైల్)



తేజ (ఫైల్)



రాజా (ఫైల్)



నితిన్ (ఫైల్)

రామాపురం సముద్రతీరంలో విషాదం

- నలుగురు గల్లంతు
- ఇద్దరు మృతి

2లో ▲







ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా ఎమ్మెల్యేలు



డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి (కొండపి)




దామచర్ల జనార్దన్ (ఒంగోలు)



బిఎన్ విజయకుమార్ (సంతనూతలపాడు)



ఉగ్ర నరసింహారెడ్డి (కనిగిరి)



కందుల నారాయణరెడ్డి (మార్కాపురం)



ముత్తుముల అశోక్‌రెడ్డి (గిద్దలూరు)



తాటిపర్తి చంద్రశేఖర్ (యర్రగొండపాలెం)



బూచేపల్లి శివప్రసాదరెడ్డి (దర్శి)



పసుపు జెండా ఎగురవేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల సంబరాలు

ప్రజాశక్తి-గిద్దలూరు

గిద్దలూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఆనందోత్సాహాలు మిన్నంటాయి. శుక్రవారం ఏపీ అసెంబ్లీలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా పట్టణంలోని గణేష్ నగర్ కూడలిలో వినాయక టెంపుల్ వద్ద తెలుగుదేశం జెండాను ఆవిష్కరించారు. అనంతరం టిడిపి నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో 25 ఏళ్ల చరిత్రను తిరగరాస్తూ ఘన విజయం సాధించిన ముత్తుముల అశోక్‌రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేశారు. రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించిన టిడిపి కూటమి భవిష్యత్తులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్ర రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా అశోక్‌రెడ్డి సారథ్యంలో గిద్దలూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు వెళ్లాలని ఆశిస్తూ తెలుగుదేశం జెండా గణేష్ నగర్ కూడలిలో ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్ర శేఖర్ యాదవ్, గడ్డం భాస్కర్ రెడ్డి, బిల్లా రమేష్, మద్దిలేటి తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్ధవీడు: గిద్దలూరు శాసనసభ్యులుగా ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రమాణ స్వీకారం సందర్భంగా అర్ధవీడు టిడిపి ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి, టిడిపి అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మారెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డిని కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు నియోజక వర్గ అభివృద్ధి ప్రదాత అని అర్ధవీడు నాయకులు కొనియాడారు.

కంభం రూరల్: గిద్దలూరు ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం సందర్భంగా సంబరాలు నిర్వహించిన తెలుగు కార్యకర్తలు ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు నియోజకవర్గానికి రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

ప్రజాశక్తి-తర్లుపాడు

సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని, గౌరవంగా పదవీ విరమణ పొందడం గొప్ప అదృష్టమని తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్తోజు సుధాకర్ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నేతాజీరెడ్డి ఉద్యోగ విరమణ, ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు పెద్దఎత్తున నిర్వహించారు. ఉద్యోగ విరమణ పొందినవారు సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని కోరారు. 35 సంవత్సరాలలో ఎంతో మంది విద్యార్థులను పౌరులుగా, ఎన్నో అత్యున్నత శిఖరాలకు చేరవేసిన నేతాజీరెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం నేతాజీరెడ్డి దంపతు లను కుటుంబ సభ్యులు, తోటి ఉపాధ్యాయులు, ఆత్మీయులు, శ్రేయోభిలాషులు శాలువాలు కప్పి, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానో పాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాలికల బిసి హాస్టల్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మార్కాపురం: మార్కాపురంలో బిసి బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ లేని కారణంగా కొందరి చదువులు ఆగిపోతున్నాయని, ఆ దిశగా హాస్టల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రధాన కార్యదర్శి ఎం రవిచంద్ర శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని బిసి వర్గానికి చెందిన తల్లిదండ్రులు వలస జీవనంపై ఆధారపడ్డారని అన్నారు. అందుబాటులో బిసి బాలికలకు హాస్టల్ వసతి లేని కారణంగా బాలికలను వారితో పాటు పనులకు తీసుకెళుతున్నారని అన్నారు. బీసీ బాలికలకు వసతి గృహం అవసరమనే విషయాన్ని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి శ్రీదేవి కూడా సబ్ కలెక్టర్ రాహుల్ మీనా దృష్టికి తీసుకెళ్లారు.

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండాలి: డిఇఒ

ప్రజాశక్తి-మార్కాపురం / మార్కాపురం రూరల్



మాట్లాడుతున్న డిఇఒ సుభద్ర

బడి వయసు కలిగిన పిల్లలంతా బడుల్లో చదువుకోవాలని, వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా చదువులు బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి డి సుభద్ర అన్నారు. డివిజన్ స్థాయిలో వివిధ రకాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం ఉప విద్యాశాఖ అధికారి చంద్రమౌళీశ్వర్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా డిఇఒ సుభద్ర మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి... తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా... ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ... నిబద్ధతతో పాఠశాలల్లో పనిచేయాలని ప్రధానోపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. పాఠశాలలో మౌళిక వసతుల కల్పనలో భాగంగా స్కూల్ ఇన్‌ఫ్రా ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా త్వరలో కల్పిస్తామని తెలిపారు. పాఠశాలల నిర్వహణలో... రికార్డుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డిజిటల్ తరగతులు, ఇతర ల్యాబ్స్, పాఠశాలల్లో ఆట స్థలం వంటివి గరిష్ట స్థాయిలో వినియోగించి విద్యార్థుల్లో గుణాత్మక మార్పులకు పాఠశాలలు వేదిక కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఈబి సెక్రటరీ వై వెంకట్రావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కెజిబివి మోడల్ స్కూల్, సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం రూరల్: 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిడిఓ సయ్యద్ మస్తాన్‌వలి అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత మన అందరి బాధ్యత అని, బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఇంటింటి సర్వే ద్వారా బడిబయట పిల్లలను గుర్తించాలని అన్నారు. 6 నుంచి 18 సంవత్సరాల వయసు గల విద్యార్థులు తప్పనిసరిగా బడిబాట పట్టేలా చూడాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో డ్రాప్ ఔట్, నెవర్ ఎన్రోల్ వివరాలను నమోదు చేయాలని అన్నారు. మండల విద్యాశాఖ అధికారులు బి మాల్యాద్రి, కె శర్వాణి మాట్లాడుతూ బడి మధ్యలో మానిన విద్యార్థులు, అసలు బడికి రాని విద్యార్థులను వేర్వేరుగా గుర్తించి అందరినీ బడిలో చేర్పించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ బి విజయలక్ష్మి, సిఆర్పీలు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, హాస్టల్ వార్డెన్లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ సురేష్ నాయక్‌కు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాచర్ల



ఏపిఎస్‌పిడిసిఎల్ ఏడిఈని చుట్టుముట్టిన బాధితులు

రాచర్ల మండలం అనుమలవీడు గ్రామంలో ఈ నెల 19వ తేదీ జరిగిన సంఘటనలో విద్యుత్ ప్రమాదానికి గురైన జూనియర్ లైన్‌మెన్ సురేష్‌నాయక్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలంటూ విద్యుత్తు ప్రమాదం సంభవించడానికి కారకులైన షిఫ్ట్ ఆపరేటర్ సురేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు సురేష్ నాయక్ తల్లిదండ్రులు బంధువులు శుక్రవారం గిద్దలూరు ఏపిఎస్‌పిడిసిఎల్ ఏడిఈ కార్యాలయంలో ఏడిఈని చుట్టుముట్టారు. వివరాల్లోకి వెళితే.. అనుమలవీడు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ జూనియర్ లైన్‌మెన్ సురేష్ నాయక్ ఈ నెల 19న అనుమలవీడు చెరువు కట్ట దగ్గర పొలంలో విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా కావడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. కర్నూలులో ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు సురేష్ నాయక్‌కు కుడికాలు, కుడి చెయ్యి వైద్యులు తొలగించారు. విద్యుత్తు అధికారులు తప్పుడు రిపోర్టు రాస్తున్నారని, షిఫ్ట్ ఆపరేటర్ ఎల్లా సురేష్ నిర్లక్ష్యం కారణం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు చెబుతున్నారు. కొంతమంది విద్యుత్ అధికారులు సచివాలయంలో పనిచేస్తున్న జేఎల్ఎం ఉద్యోగులకు జాబ్ చార్టు ప్రకారం కాకుండా తమ ఇష్ట ప్రకారం లైన్‌మెన్‌లకు సంబంధంలేని పనులు చేయించడం వలన ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కాబట్టి ఎల్లా సురేష్‌ను విధుల నుంచి తొలగించి అతనిపై వెంటనే కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని సురేష్ నాయక్ తల్లిదండ్రులు, బంధుమిత్రులు ఏడిఈ శేషగిరిరావును చుట్టుముట్టి డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న గిద్దలూరు అర్బన్ సీఐ వైవీ సోమయ్య, రాచర్ల, గిద్దలూరు ఎస్ఐలు, పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సిఐ వైవీ సోమయ్యపై అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు. ఏపిఎస్‌పిడిసిఎల్ ఏడిఈ శేషగిరిరావు బాధితుడు సురేష్‌కు విద్యుత్ శాఖ ద్వారా సహాయం అందిస్తామని, విచారణ జరిపి సంబంధిత బాధితులపై, షిఫ్ట్ ఆపరేటర్ సురేష్‌పై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఉప కలెక్టర్ రాహుల్ మీనా

డ్రాపవుట్స్‌ను పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు 'నేను బడికి పోతా' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మార్కాపురం ఉప కలెక్టర్ రాహుల్ మీనా అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో ఉప కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో ఉండాలి. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ప్రతి ఒక్క అధికారి భాగస్వామి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. జులై 12 లోపు బడి మానేసిన పిల్లలను గుర్తించి మళ్లీ బడిలో చేర్పించాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో 100 శాతం ఎన్‌రోల్ అయ్యే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం తహశీల్దారు కే రవికుమార్, ఎంపిడిఓ తోట చందన, డిప్యూటీ ఈవో చంద్రమౌళీశ్వర్, ఎంఈవోలు బి రామదాసు నాయక్, శ్రీనివాసులు, బీసీడబ్ల్యూఓ జబ్బార్, ఏఎస్‌డబ్ల్యూఓ ఎన్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మత్తు పదార్థాల వినియోగం వలన విద్యార్థుల జీవితాలు చిత్తు అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండి యువత తమ ఉజ్వలమైన భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని మార్కాపురం డిఎస్‌పి పి బాలసుందరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక తర్లుపాడు రోడ్డులోని జార్జి బీఫార్మసీ కాలేజీలో యాంటీ డ్రగ్ డే సందర్భంగా విద్యార్థులకు మత్తుపదార్థాల వాడకంపై కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి బాలసుందరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని, చదువుకోవడానికి తమ పిల్లలను కళాశాలలకు పంపిస్తారని, అలాంటి చోట వారికి డ్రగ్స్‌కు అలవాటు కావడం, వాటిని ప్రోత్సహించడం లాంటివి జరగడం మంచిది కాదన్నారు. ప్రతి కాలేజీలో 'యాంటీ డ్రగ్స్ కమిటీ' లను ఏర్పాటు చేశామని, ర్యాగింగ్ లాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయించిన, వాడకానికి ప్రేరేపించిన వెంటనే 100 నంబర్‌కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు షేక్ అబ్దుల్ రహమాన్, ఎం వెంకటేశ్వర నాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సునీత, హెచ్‌ఓడి అశోక్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-తర్లుపాడు: తర్లుపాడు ముస్లిం బజార్‌లోని మండల ప్రాథమిక (ఉర్దూ) పాఠశాలలో మార్కాపురం క్లస్టర్ పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు కందుల రామిరెడ్డి తనయుడు కందుల రోహిత్‌రెడ్డి, టిడిపి నాయకుల చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్స్, బెల్టులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కందుల రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నేడు టిడిపి ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించేందుకు రంగం సిద్ధం చేసిందని అన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- వెలిగండ్ల

పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం ఎఒ వి.వెంకటశేషమ్మ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లు వాటి నివారణ మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు .రైతులు తాము సాగు చేసే పంటలపై అడిగిన సందేహాలకు సమాధానం తెలియజేశారు.జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి శైలజ రాణి మాట్లాడుతూ వ్యవసాయంలో జీవన ఎరువులు మరియు సేంద్రీయ ఎరువుల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎఒ రంగ కృష్ణ మాట్లాడుతూ 50 శాతం రాయితీపై రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు అందజేస్తున్నట్లు తెలిపారు. . అనంతరం పంటల సాగు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులకు సంబంధించిన కరదీపికలు రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ శైలజారాణి

ప్రమాణ స్వీకారం చేసిన బాపట్ల జిల్లా శాసనసభ్యులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న అద్దంకి, రేపల్లె, పర్చూరు, వేమూరు, బాపట్ల, చీరాల ఎంఎల్ఎలు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సాంబశివరావు, ఆనందబాబు, నరేంద్రవర్మ, కొండయ్య

స్కీమ్ వర్కర్లపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం జిల్లాలో వివిధ స్కీముల్లో పనిచేస్తున్న వర్కర్లపై రాజకీయ వేధింపులు ప్రారంభం అయ్యాయని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పడిందని, మీరు వెంటనే తప్పుకోండని, తమకు సంబంధించిన మనుషులను పెట్టుకుంటామనే పేరుతో జిల్లాలోని అద్దంకి, కొరిశపాడు, పర్చూరు, చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు తదితర మండలాల్లో ఆశా, అంగన్‌వాడి, మిడ్ డే మీల్స్, యానిమేటర్స్ రంగాల్లో వర్కర్లపై వేధింపులు చేస్తున్నారని అన్నారు. ఇది సరైన పద్ధతి కాదని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్కీం వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు కొనసాగిస్తున్నారని అన్నారు. రాజకీయాల పేరుతో స్కీం వర్కర్లని వేధించటం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కింది స్థాయిలో జరుగుతున్న వేధింపులు అరికట్టడం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. స్కీం వర్కర్లు అనేకేళ్లుగా రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని పోరాటాలు నిర్వహించారని అన్నారు. ఎన్నికల ముందుగా పెద్ద ఎత్తున వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించి వైసిపి ప్రభుత్వం ఓటమికి స్కీం వర్కర్లు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రాజకీయ వేదింపులు ఆపాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుండి సిపిఎం శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - చీరాల

సీపీఎం కార్యకర్తల జిల్లా శిక్షణా తరగతులు ఈనెల 22, 23 తేదీల్లో స్థానిక ఎస్‌జె రంగనాయకులు, బాపన్నమ్మ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి నలతోటి బాబురావు తెలిపారు. జిల్లాలోని 25 మండలాల నుండి 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో ప్రజా ఉద్యమాలు ముందుకు తీసుకెళ్లేందుకు, మారిన రాజకీయ పరిస్థితుల్లో ఉత్పన్నమయ్యే ప్రజా సమస్యలు, ప్రజలపై నయా ఉదారవాద విధానాల ప్రభావం తదితర అంశాలపై చర్చిస్తారని తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాఉద్యమాలు ముందుకు తీసుకెళ్లేందుకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తరగతులకు సీపీఎం రాష్ట్ర నాయకులు డి రమాదేవి, వై సిద్ధయ్య, జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిహెచ్ మణిలాల్, టి కృష్ణమోహన్, సిహెచ్ మజుందర్ హాజరవుతారని తెలిపారు.



చేతి పంపును పరిశీలిస్తున్న ఎంపిడిఒ, ఈఓపిఆర్‌డి

తాగునీటి పంపు ఏర్పాటు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివర్రు పంచాయతీలో గల అక్కివారిపాలెంలో త్రాగునీరు సక్రమంగా లేక ప్రజలు అవస్థలు పడుతున్న దృష్ట్యా గ్రామంలోని చర్చి ప్రాంగణంలో నూతన చేతిపంపులు పంచాయతీ అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామస్తుల నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన మోటార్ పంపులు భూగర్భ జలాలు మార్పు రావడంతో త్రాగటానికి పనికి రాక గ్రామస్తులు గ్రామాలకు వెలుపల ఉన్న చేతిపంపులు, మినరల్ వాటర్ ప్లాంట్ల నుండి నీటిని కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు. అయితే చర్చి ప్రాంగణంలో గతంలో ఉన్న చేతిపంపు నీరు ప్రజలందరూ తాగటానికి అనువుగా ఉండేవని, ఆ పంపు పాడైపోవడంతో గ్రామంలో త్రాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు వాపోయారు. దీంతో స్పందించిన పంచాయతీ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్చి ప్రాంగణంలో అనువైన భూగర్భ జలాలు కలిగిన ప్రాంతంలో చేతిపంపు నిర్మాణాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. గ్రామం మొత్తం పంచాయతీ అధికారులు పారిశుధ్య నిర్మూలన చేపట్టి బ్లీచింగ్ సున్నం చల్లించారు. ఈ మేరకు ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఈఒపిఆర్డి ఊహారాణి, పంచాయతీ కార్యదర్శి సౌరిజోజి, సర్పంచ్ నీలా ఉషారాణి రమేష్ దగ్గరుండి పరిశీలించి ఏర్పాటు చేశారు.

నీట్ పరీక్షల ఆరోపణలపై విచారణ జరిపించాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ కుమార్ డిమాండ్

ప్రజాశక్తి - బాపట్ల

నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ను రద్దు చేయాలని కోరుతూ స్థానిక పాత బస్టాండ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్ యూజీ 2024 ఫలితాల్లో జరిగిన అవకతవకలపై వైద్య ప్రవేశ పరీక్షలు వ్రాసిన విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. హరియాణాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలకు దారితీస్తుందన్నారు. నీట్ పరీక్షలో విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు వచ్చాయని అన్నారు. 21న సుప్రీంకోర్టు దీనిపై విచారణ చేస్తున్న నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు చేస్తున్న విచారణలో నీట్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని నిర్ధారణ జరిగినట్లు రుజువైందన్నారు. దీనికి సంబంధించి పలువురిని అరెస్టు చేసిన నేటికీ కేంద్ర ప్రభుత్వం నీట్ యూజీ పరీక్షలపై మౌనం వీడకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నీట్ పరీక్షలో జరిగిన అవినీతిలో బిజెపి నేతలు ఉన్నారని ఆరోపించారు. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడిని పెంచిందని అన్నారు. ఇది పూర్తిగా రాష్ట్రాల హక్కులను కలరాయడమే అవుతుందని అన్నారు. నీట్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నీటిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందినందుకు ఈ ఏజెన్సీని రద్దు చేయాలన్నారు. మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షను భవిష్యత్తులో రాష్ట్రస్థాయిలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు భాను, మణికంఠ, శివమణి, ఆదిత్య, యస్వంత్ పాల్గొన్నారు.



బాపట్లలో ఎస్ఎఫ్ఐ నీట్‌లో అవకతవకలపై నిరసన ర్యాలీ

ఉపాధి కూలీలకు వెంటనే వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - వేమూరు

చుండూరు మండలంలోని ఆలపాడు, చినపరిమి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్న ప్రాంతాలను సిఐటియు నాయకులు బొనిగల ఆగస్టు శుక్రవారం పరిశీలించారు. కూలీల వసతులు, వేతనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే కూలీలకు సుమారు 6 వారాలుగా వేతనాలు మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు పూటలా పని విధానాన్ని ప్రవేశ పెట్టడంతో రెండవ పూటకు మరో మారు పది కిలోమీటర్ల దూరం వెళ్లి రావాల్సి వస్తుందని అన్నారు. దీనివలన సమయ భావంతోపాటు దూర ప్రాంతానికి వెళ్లి రావాల్సి ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కూలీలు వాపోయారు. ప్రభుత్వం పరిశీలించి తక్షణమే రెండవ పూట పని విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పథకంలో పనిచేసే కూలీలంతా నిరుపేదలని ఏ పూటకు ఆ పూట పనిచేసుకుని జీవించే వీరికి ఆరు వారాలపాటు వేతనాలు వేయకపోతే ఏ విధంగా బ్రతకాలని ప్రశ్నించారు. ఈ చట్టం నిబంధనల ప్రకారం పనిచేసిన కూలీలకు రెండు వారాల మీద వేతనాలు అందించాల్సి ఉందని గుర్తు చేశారు. కూలీలకు ఎంతగానో ఉపయోగపడే ఈ పథకాన్ని ఉద్దేశ పూర్వకంగా కేంద్ర ప్రభుత్వం దీనిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తుందని అన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.30వేల కోట్లు తక్కువ నిధులు కేటాయించిందని ఆరోపించారు. ఈ పథకం ద్వారా కూలీలకు అందవలసిన సామాగ్రి, వేసవి అలవెన్స్, త్రాగునీరు వంటివి అందజేయాలని కోరారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఆగస్టీన్

యువతి హత్య కేసు ముద్దాయిలను శిక్షించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ఈపురుపాలెంలో అత్యాచారం హత్యకు గురైన యువతికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ చీరాల మండలం ఈపురుపాలెంలో పి సుచరిత అనే యువతిపై సామూహిక అత్యాచారం జరగటం విచారకరమని అన్నారు. చనిపోయిన యువతి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు పరిహారం ఇవ్వాలని అన్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకుని ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని కోరారు. నిందితుల్ని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ఐద్వా జిల్లా కమిటి ఖండన

చీరాల మండలం ఈపురుపాలెంలో పి సుచరిత అనే యువతిపై సామూహిక అత్యాచారం జరగడం విచారకరమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా నాయకురాలు టి సుభాషిణి అన్నారు. నిందితులను వెంటనే పట్టుకుని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని కోరారు. మహిళల పట్ల ఇటువంటి ఘటనలు జరిగిన సందర్భంలో గత ప్రభుత్వం పట్టించుకోకుండా ఉండబట్టే పునరావృతం అవుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మహిళా చట్టాలు అమలయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. నిందితుల్ని నిర్ధారించి కఠినంగా శిక్షించాలని అన్నారు.



ఖరీఫ్ సాగు సన్నద్ధతపై జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పంట కాల్వలు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నందున పంట కాల్వలు ముందుగానే మరమ్మతులు చేయాలని కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖలతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో సమీక్ష నిర్వహించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉంచాలన్నారు. పొలాల్లోని మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌లో 1,41,916 ఎకరాల్లో పంటల సాగుకు రైతులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం 1,045 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉంచామన్నారు. జూన్ నెలలో సగటు వర్ష పాతం నమోదైందని చెప్పారు. నీటి విడుదలకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో 154 చోట్ల కాల్వల మరమ్మత్తు పనులు చేపట్టాలని రూ.13.43కోట్ల నిధులతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అధికారిక మంజూరు లభించగానే పనులు ప్రారంభించాలని అన్నారు. సమావేశంలో ఎడి వై రామకృష్ణ, కష్ణ పశ్చిమడెల్టా ఎస్ఈ ఉమా మహేశ్వరరావు, ఈఇ మల్లికార్జున, మురళీకష్ణ, ఉద్యాన వన శాఖ ఎడి జెనెమ్మ పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

సింథైట్ ఫ్యాక్టరీ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - మేదరమెట్ల

సింథైట్ ఫ్యాక్టరీ మూసివేస్తామని యాజమాన్యం చెప్పడంతో ఫ్యాక్టరీలోని కార్మికులు శుక్రవారం ఆందోళన చేశారు. స్థానిక జాతీయ రహదారిపై కొద్దిసేపు బైఠాయించి నినాదాలు చేశారు. అక్కడికి చేరుకున్న కొరిసపాడు ఎస్ఐ శివయ్య కార్మికులకు నచ్చజెప్పి పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. కార్మికుల సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీకి సంబంధించిన ఏమైనా సమస్య ఉంటే అక్కడే ఆందోళన చేయాలని, జాతీయ రహదారిపై చేయడం సరి కాదని చెప్పారు. సమస్యకు సంబంధించి వినతి పత్రం అందించాలని కార్మికులకు సూచించారు. ఇటువంటి సమస్యలు ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు.

ఏపి ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం

ప్రజాశక్తి - చీరాల

ఈ నెల 25న ఏపీ ఉద్యోగుల సంఘం చీరాల తాలూకా జనరల్ బాడీ సమావేశం స్థానిక డ్రైనేజీ అతిథి గృహం నందు జరుగుతుందని తాలూకా ప్రెసిడెంట్ దేవర వినోద్, సెక్రటరీ కావూరి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. జిల్లా ప్రెసిడెంట్, సెక్రెటరీ కె రోశయ్య, పి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

యోగాతో శారీరక ఆరోగ్యం పదిలం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు అన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్రతిరోజు యోగ చేయడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. యోగాతో రోగాలు నయమవుతాయని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ తెలిపారు. రవాణా శాఖ జిల్లా అధికారి సురేష్, అటవీ శాఖ అధికారి బీమయ్య, డిఐపిఆర్ఓ సహాయ సంచాలకురాలు కె సుభాషిణి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని రాజదిబోరా, ఉద్యానవన శాఖ ఎడి జెన్నమ్మ, ఆయుష్ శాఖ వైద్యాధికారి డాక్టర్ బాలప్రభావతి పాల్గొన్నారు.



యోగా దినోత్సవం పాల్గొన్న రెవిన్యూ అధికారి సత్తిబాబు, విద్యార్థులు

అద్దంకి : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సింగరకొండ కట్ట రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో యోగా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు, కామర్స్ విభాగ అధ్యక్షులు శిఖామణి, కెమిస్ట్రీ విభాగ అధ్యక్షులు పివి హేమలత, ఎన్ఎస్ఎస్ 1, 2 విభాగ ఇంక్లూజివ్ సెంటర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : యోగాతో శారీరక ఉల్లాసం, ధ్యానంతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం మాచర్ల మోహనరావు సూచించారు. విద్యార్థులచే యోగ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు చేయించారు. విద్యార్థులకు సమరసతా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను బహూకరించారు. సమరసత సేవ ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమ శంకరరావు ఉన్నారు.

రేపల్లె : స్థానిక ఎబిఆర్ డిగ్రీ కళాశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెసి రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ యోగా వల్ల శారీరక ఆరోగ్యమే కాక మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని అన్నారు. యోగాతో మానసిక, శరీర దృఢత్వం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పర్చూరు : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ కోర్టు, రోటరీ భవన్లో యోగా శిక్షణ నిర్వహించారు. సివిల్ జడ్జి పి శాంతి మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చెయ్యడం వలన ఆరోగ్యంగా జీవించ గలరని అన్నారు. రోటరీ ఉపాధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. పాబోలు వెంకన్న శిక్షణ ఇచ్చారు. బార్ అసోసి యేషన్ అధ్యక్షురాలు దగ్గుబాటి రమణి, రావి సత్యనారా యణ, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, ఎం వీరాంజనేయులు, టి రాజేష్, కోమటి ఆంజనేయులు, కాసా అశోక్ పాల్గొన్నారు.

బాపట్ల : మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులను తట్టుకొని ఆరోగ్యంగా జీవించేందుకు యోగా, మెడిటేషన్ వంటి ప్రక్రియ అలవర్చుకోవాలని మెడిటేషన్ శిక్షకురాలు మానం మల్లీశ్వరి అన్నారు. సిడిపిఓ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు యోగ, మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిడిపిఓ శైలజ, సూపర్వైజర్లు జ్యోతి, త్రివేణి, పద్మావతి, రాధా, నాగమల్లీశ్వరి, అరుణ కుమారి పాల్గొన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల, మహిళా ఇంజనీరింగ్ కళాశాలతో పాటు పట్టణంలోని ఎకో హౌస్, ఇతర విద్యా సంస్థల్లో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానవ నాగేశ్వరరావు, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జి శ్రీనివాసరావు, యోగా జిల్లా అధ్యక్షులు కళ్ళం హరినాధరెడ్డి, బాపట్ల వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డిడి స్మిత్, ఎకో హౌస్ నిర్వాహకులు డాక్టర్ శరత్ బోస్ పాల్గొన్నారు.

నిజాంపట్నం : యోగాతో మానసిక ప్రశాంతత తోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పల్లపట్ల ఐసీడీఎస్ సీడీపీఓ అనసూయ అన్నారు. జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామంలోని దర్వేష్పాలెం అంగన్‌వాడి కేంద్రంలోని విద్యార్థుల చేత యోగా ఆసనాలు చేయించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో చేర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్వైజర్ ప్రసునాంబ, కార్యకర్తలు ఉష, గాయత్రి, గౌసియా, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కర్లపాలెం : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా హై వెండ్ ప్రైమరీ, హైస్కూల్ నందు విద్యార్థులు యోగాసనాలు, సూర్యనమస్కారాలు చేశారు. పాఠశాల చైర్మన్ ఉదయచంద్రరావు, డైరెక్టర్స్ చాందిని, జ్యోతి యోగా ప్రాముఖ్యత వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ సాయి మహేంద్ర బాబు మాట్లాడారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్చార్జి లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

సంతమాగులూరు : మానసిక ప్రశాంతత పెంచేందుకు యోగా ఎంతో దోహద పడుతుందని కెజిబివి ఎస్ఒ శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని ఏల్చూరు కెజిబివిలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఇసుక లేక నిలిచిపోయిన కట్టడాలు

ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికలు పూర్తయిన అనంతరం గత నెల రోజులుగా ఇసుక రీచ్‌ల నుండి ఇసుక తరలించడాన్ని అధికారులు నిషేధించారు. దీంతో ఇసుక కొరత ఏర్పడింది. కట్టడాలు నిలిచిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో విచ్చలవిడిగా కంపెనీల పేరుతో ఇసుక అక్రమ రవాణా, ఇసుక దందాలు చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో ప్రధానమైన రీచుల నుండి ఇసుకను లక్షల క్యూబిక్ మీటర్లలో డంపు చేశారు. అప్పటి అధికార వైసిపి నాయకులకు కాసులు కురిపించాయి. ఎన్నికల పూర్తయిన అనంతరం శాసన సభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు టిడిపి కేంద్ర కార్యాలయం మంగళగిరిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఇసుక మాఫియాపై పెద్ద ఎత్తున ఆధారాలతో వైసీపీ ప్రభుత్వంలో చేసిన ఇసుక దందాను చూపించారు. దీంతో కదిలిన అధికార యంత్రాంగం గత నెల 20న భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో కలెక్టర్ రంజిత్ భాష, ఎస్పీ వకుల్ జిందాల్, రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్, జిల్లా మైనింగ్ అధికారులతో కలసి ఇసుక రిచ్‌లను పరిశీలించారు. ఇసుక దోపిడీని గుర్తించారు. ఇకపై నూతనంగా ఏర్పడి ప్రభుత్వం తీసుకునే విధివిధానాలు ఆదేశాలు వచ్చేంతవరకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు రీచుల్లోనికి ట్రాక్టర్లు, టైరు బండ్లు, లారీలు వెళ్లకుండా దారిలో పెద్దపెద్ద గంట్లు పెట్టి సిబ్బందిని కాపలాగా ఏర్పాటు చేశారు. దీంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. దీని కారణంగా భవన నిర్మాణాలకు ఇసుక అందుబాటులో లేకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ముఖ్యంగా జగనన్న కాలనీలో వేసవికాలం దృష్ట్యా వాహనాల రాకపోకలు ఉన్న సమయంలోనే గృహ నిర్మాణాలు చేపట్టుకోవాలనుకున్న లబ్ధిదారులకు ఇసుక కొరత కారణంగా నిర్మాణాలు నిలిచిపోయాయని లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలు పూర్తిస్థాయిలో ప్రారంభమైతే కాలనీలోకి వాహనాలు కూడా వెళ్లే దుస్థితి లేదని, మరో వేసవికాలం వరకు వేచి చూడక తప్పదని వాపోతున్నారు.



ఇసుక లేక నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలు

పనుల్లేక ఇబ్బంది పడుతున్న కార్మికులు

గత నెల రోజులుగా ఇసుక కొరత ఏర్పడడంతో భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు ఉపాధి అంధక నానా అవస్థలు పడుతున్నారు. భవన నిర్మాణానికి చిన్న చిన్న పనులు చేపట్టుకునే వారికి ట్రాక్టర్లు, టైర్ బండ్లు ద్వారా ఇసుక అందుబాటులో ఉండేది. ట్రాక్టర్లు నిలిపివేసినప్పటికీ కనీసం టైరు బండ్ల తోనైనా ఇసుకను తరలించుకునే అవకాశం ఉంటే కొంతమేర ఇసుక కొరత తీరేదని చెబుతున్నారు. టైరు బండ్లు కూడా ఇసుక తీసుకోవడానికి అనుమతి నిరాకరించడంతో నిర్మాణాలు చేపట్టే యజమానులకు, టైర్ బండ్ల యజమానులకు ఇబ్బందికరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నూతన ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకొస్తామని ప్రకటించిన మేరకు త్వరితగతిన దానిపై విధివిధానాలు ఖరారు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తే భవన నిర్మాణ పనులు కొనసాగడంతో పాటు ఇటు నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు ఉపాధి లభిస్తుందని కోరుచున్నారు. ప్రభుత్వం ఇసుకపై నెలకొన్న సమస్యను పరిష్కరించడ, బండ్ల ద్వారా ఇసుకను తరలించుకునేందుకు అవకాశం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

పొలాల్లో మట్టి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతుల పొలాల్లో వ్యవసాయ అసిస్టెంట్లు ద్వారా మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు ఎఒ లావణ్య తెలిపారు. ఆర్‌బికె కేంద్ర పరిధిలో 40మంది రైతుల పొలాల్లో మట్టి నమూనా సేకరిస్తున్నట్లు తెలిపారు. రైతుల భూములల్లో సూక్ష్మ పోషకాల స్థితి తెలుసుకునేందుకే నమూనా సేకరిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూములలో జింక్, బోరాన్, మెగ్నీషియం, పొటాషియం, సల్ఫర్, నత్రజని, భాస్వరం ఏ మోతాదులో వాడాలనే విషయం రైతుకు తెలుస్తుందన్నారు. సేకరించిన మట్టి నమూనాలను బాపట్ల సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ప్రక్రియ వారంలోగా పూర్తి చేయాలని విఎఎలను ఆదేశించినట్లు తెలిపారు. మట్టి నమూనాల ఫలితం ఆధారంగా రైతులు ఎంత మోదాదులో ఏ ఎరువులు వాడాలనేది చెప్పగలమని అన్నారు.

అదుపుతప్పి కాలువలో బోల్తా పడ్డ కారు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వేగంగా వస్తున్న కారు లైట్‌గా మల్పు ఉండటంతో డ్రైవర్ గమనించకపోవడంతో పక్కకు దూసుకు వెళ్లి తిరగబడిన ఘటన మండలంలోని ఐలవరం గ్రామం వద్ద శుక్రవారం జరిగింది. గుంటూరు నుండి పెనుమూడి వైపు వెళుతున్న కారు మైలవరం దాటగానే తక్కువ మోతాదులో ఉన్న మలుపును గమనించక వేగం అదుపులోకి రాకపోవడంతో కారు ఎడమవైపుకు దూసుకు వెళ్లి పక్కనే ఉన్న కాలువలో తిరగబడింది. ఆ సమయంలో కారులో డ్రైవర్ తప్ప ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయ్యింది. అయితే డ్రైవర్ కూడా స్వల్ప గాయాలతో బయటపడి చికిత్స నిమిత్తం వైద్యశాలకు వెళ్ళాడు. 216 జాతీయ రహదారి మార్గంలో జరిగిన సంఘటనలో ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.



కాలువలోకి దూసుకు వెళ్లిన కారు



శిడిమాను మహోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

వైభవంగా శ్రీ కనక నాగవరపమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి - వేటపాలెం

ప్రసిద్ధి చెందిన శ్రీ కనక నాగవరపమ్మ తిరునాళ్లు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గుంటూరు దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ బి మహేష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ ఎం పానకాలరావు, ఆలయ ఇఒ బి శ్రీనివాసరావు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ప్రత్యేకంగా తీసుకొచ్చిన పూలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. శిడిమాను మహోత్సవాన్ని కన్నుల పండుగగా భక్తులు తిలకించారు. వేకువ జాము నుండి బస్సులు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలపై భక్తులు తరలివచ్చారు. శిడిమానును ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. రైతులు తమ పంట ఉత్పత్తులను కట్టి భక్తి చాటుకున్నారు. పొంగళ్ళు చేసి నైవేద్యాలు సమర్పించారు. సేవా సంఘాలు స్వచ్ఛందంగా ప్రజలకు తాగునీరు మజ్జిగ ఉచితంగా అందించారు. మధ్యాహ్న సమయంలో అన్నదానం చేశారు. డిఎస్పి బేతపూడి ప్రసాదరావు ఆధ్వర్యంలో వేటపాలెం ఎస్ఐ జి సురేష్ బందోబస్తు నిర్వహించారు.



వైట్‌బర్లీ బేళ్లను లోడు చేస్తున్న రైతులు

తక్కువ ధరకే పొగాకు విక్రయాలు

ప్రజాశక్తి - పర్చూరు

వైట్ బర్లీ పొగాకు అమ్మకాలు మండలంలో జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సాగు ప్రారంభం కానుండటంతో ఈ సంవత్సరం సాగు చేసేందుకు పెట్టుబడుల కోసం రైతులు తమ వద్ద నిల్వ చేసుకున్న వైట్ బర్లి పొగాకును విక్రయిస్తున్నారు. పంట చేతికి అంది వస్తున్న తరుణంలో నాసిరకం పొగాకు క్వింటా రూ.14వేలు పైచిలుకు ధరతో విక్రయాలు చేస్తున్నారు. నాణ్యమైన మంచి గ్రేడు పొగాకుకు మంచి ధర ఉంటుందన్న ఆశతో ఎక్కువ మంది రైతులు పొగాకు ఉత్పత్తులను నిల్వ చేసుకున్నారు. నెలలు తరబడి నాణ్యమైన ధర కోసం ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగిలింది. నాణ్యమైన మంచి గ్రేడ్ పొగాకు కూడా క్వింటాలు రూ.14500 మించి ధర లేకపోవడంతో గత్యంతరం లేక అందిన కాడికే అమ్ముకుంటున్నారు. సబ్ డివిజన్లో గత ఏడాది ఎక్కువ భాగం రైతులు వైట్ బర్లి పొగాకును సాగు చేసుకున్నారు. నాణ్యమైన పొగాకును కూడా ఈ రేటుకు అమ్మటంతో అసంతృప్తి చెందుతున్నారు.

25లోగా దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చుండూరు

స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల్లో ఖాళీలను భర్తీ చేయటానికి ఈనెల 25న సాయంత్రం ఐదు గంటల్లోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రవేశానికి సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 26న ఉదయం 10 గంటలకు పాఠశాల ప్రవేశ పరీక్ష నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.


జయ.. జయ.. జయ.. జయహొ గొట్టిపాటి...
దిగ్విజయహొ.. గొట్టిపాటి...
ప్రతి అడుగు ప్రజల కోసం.. ప్రతి ఆలోచన ప్రగతి కోసం... అనునిత్యం ప్రజలతో కలిసి సాగుతూ... ప్రతి కుటుంబానికి తోడుగా ఉంటూ...
అవరోధాలకు బెదరక.. అపజయాలకు అవకాశమివ్వక... వరుస విజయాలతో ఉవ్వెత్తున ఎగిసే కెరటమై...
నవ్యాంధ్ర రథసారథి, రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి సారధ్యంలో
రూపుదిద్దుకున్న ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి వర్యులుగా నేడు పదవీ బాధ్యతలు చేపడుతున్న
ప్రియతమ నాయకులు, అద్దంకి నియోజకవర్గ రథసారథి శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారికి
విజయోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ... వారి సారధ్యంలో అభివృద్ధిలో ముందుండాలని కోరుకుంటూ...
నాగినేని రామకృష్ణ
టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు
కరి పరమేష్
క్లస్టర్ ఇన్చార్జ్-6 అద్దంకి
మానం మురళీ మోహన్ దాస్
క్లస్టర్ ఇన్చార్జ్ -5 చినకొత్తపల్లి
పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి
మండల టిడిపి మాజీ అధ్యక్షులు
చాగంటి రాజేంద్రప్రసాద్
మాజీ సొసైటీ అధ్యక్షులు, ధర్మవరం
కటారి నాగేశ్వరరావు
మండల టిడిపి అధ్యక్షులు, కలవకూరు
జొన్నలగడ్డ గోపి
మండల తెలుగు యువత అధ్యక్షులు
మల్లాది కోటేశ్వరమ్మ నటరాజు
ఎం.పి.టి.సి. జార్లపాలెం
బండారు రాఘవ
టిడిపి బిసి సెల్ అధ్యక్షులు, చినకొత్తపల్లి
మాదాల శ్రీనివాసరావు
టిడిపి నాయకులు, వెంపరాల
గాలం శ్రీనివాసరావు
గ్రామ సర్పంచ్, కుంకుబాడు
అడుసుమల్లి భారతి శ్రీనివాసరావు
మాజీ సర్పంచ్ తిమ్మాయపాలెం
పెంట్యాల రామాంజనేయులు
తెలుగుయువత, నాగులపాడు
గుర్రం నాగరాజు
టిడిపి బిసి సెల్ అధ్యక్షులు, గుర్రంవారిపాలెం
నర్రా వీరయ్య
టిడిపి గ్రామ నాయకులు, మోదేపల్లి
రాయుడు నరేంద్ర
టిడిపి నాయకులు, చక్రాయపాలెం
వేములపాటి రాజశేఖర్ రెడ్డి
మాజీ సర్పంచ్, రామాయపాలెం
కొండ్రు వీరాంజనేయులు (పంతులు)
టిడిపి ఎస్సీ సెల్ నాయకులు, శంకవరప్పాడు
మండల తెలుగు దేశం పార్టీ - అద్దంకి, బాపట్ల జిల్లా



ప్రజాశక్తి

కామేపల్లి
శ్రీ పోలేరమ్మ తల్లి
తిరునాళ్ల మహోత్సవ
ప్రత్యేక అనుబంధం

ప్రకాశం జిల్లా | 8 పేజీలు | 22 జూన్ 2024 | Advt feature

'కామేపల్లి' పోలేరమ్మ..

భక్తుల విశ్వాసానికి ప్రతీక

శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయానికి ఇతర జిల్లాల నుంచీ భక్తుల రాక

ప్రజాశక్తి-జరుగుమల్లి

ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, కామేపల్లి గ్రామంలో వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లి గ్రామ దేవత కామేపల్లితో పాటు కొండపి, కందుకూరు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గంతో పాటు ప్రకాశం జిల్లాలోని వేలాదిమంది గ్రామ ప్రజల కల్పతరువుగా మారిందని ఆ ప్రాంత భక్తులు విశ్వసిస్తారు.

శ్రీ పోలేరమ్మ పేరున గ్రామ దేవత ఆవిర్భవించిన తీరు పరిశీలిస్తే.. జిల్లాలోని జరుగుమల్లి మండలం, కామేపల్లి గ్రామం పొలిమేర ప్రాంతంలో కామేపల్లి రావులకొల్లు రహదారిలో పడమర వైపున ఉన్న పొలాలలో 1910-20 సంవత్సరాల కాలంలో కామేపల్లి గ్రామానికి చెందిన బీడు భూముల్లో కొన్ని శిలలు గుర్తించినట్లు స్థానికుల కథనం. తొలుత ఈ శిలలకు అక్కడే పూజలు నిర్వహించేవారు. తర్వాత కొద్ది కాలానికి రావులకొల్లు రహదారి సమీపంలోని చాగంటి రోశప్ప నాయుడుకి చెందిన పొలంలో ఈ శిలలను తెచ్చి, అక్కడ ప్రతిష్టించి చిన్నపాటి గుడిని నిర్మించారు. అప్పట్లో కొద్ది మంది మాత్రమే అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. మొక్కులు తీర్చుకునేవాళ్లు. అప్పట్లో కామేపల్లి గ్రామస్తులు అధిక శాతం మంది ప్రజలకు ఆటలమ్మ, తడపర, దద్దు వంటి చర్మ వ్యాధులు సోకి ఆందోళన చెందేవారు. వ్యాధి సోకిన వారు ▶ 2లో


కామేపల్లి పోలేరమ్మ తల్లి




నూతన శోభతో పోలేరమ్మ ఆలయం

ప్రజాశక్తి-జరుగుమల్లి

మండలంలోని కామేపల్లి గ్రామ శివారులో శతాబ్ద కాలం క్రితం నెలకొల్పిన శ్రీ పోలేరమ్మ ఆలయం నూతన శోభను సంతరించుకుంది. జిల్లాతో పాటు కోస్తా, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల నుంచి ఇక్కడికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. వారంలో ప్రతి మంగళవారం, ఆదివారం నాడు ఇక్కడ సందడి వాతావరణం నెలకొంటుంది. కాగా ఇటీవల శుక్రవారం నాడు కూడా రద్దీ పెరిగిందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయం మొన్నటివరకు అభివద్ధిలో వెనుకబాటుకు గురైంది. స్థానికులు ప్రజాప్రతినిధుల చొరవతో 2012వ సంవత్సరంలో ప్రభుత్వం ఈ ఆలయాన్ని దేవాలయ శాఖలో విలీనం చేశారు. తొలుత కామేపల్లికి చెందిన చుండూరి వెంకటేశ్వర్లు ఛైర్మన్ ధర్మకర్తల మండలి ఏర్పడింది. పాలకమండలి రెండేళ్లపాటు కొనసాగింది. అనంతరం కొద్ది కాలం ఆలయ అధికారులు కార్యకలాపాలు నిర్వహించారు. తర్వాత ఇదే గ్రామానికి చెందిన పావులూరు నాగేశ్వరరావు ఛైర్మన్‌గా పాలకమండలి ఏర్పడింది. కమిటీ రెండు దఫాలుగా కొనసాగింది. ఈ కాలంలో పలు అభివద్ధి పనులు నిర్వహించారు.

నేడు తిరునాళ్ల


పోలేరమ్మ తల్లి


పోలేరమ్మ తల్లి ఆలయం

నేడు పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

కామేపల్లి గ్రామంలోని పోలేరమ్మ తిరునాళ్ల శనివారం జరగనుంది. ఈ తిరునాళ్లకు కామేపల్లి, కొండపి, కందుకూరు, ఒంగోలు, కనిగిరి నియోజక వర్గాలతో పాటు జిల్లాలోని వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమి రోజున పోలేరమ్మ తిరునాళ్లను దేవస్థానం కమిటీ నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఈ ఏడాది కూడా ఏరువాక పౌర్ణమి కావడంతో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల ప్రారంభమైంది. దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. తిరునాళ్ల ప్రారంభం రోజున నిలుపు, చంద నాలంకరణ, అమ్మవారికి నవనీతాలంకరణ, ఉదయం 10 గంటల నుంచి అన్నదానం, సాయంత్రం 6 గంటల నుంచి ఒంగోలు కు చెందిన చందు డాన్స్ అకాడమీ వారిచే కూచిపూడి నాట్యం, రాత్రి 9 గంటలకు అల్లూరు వారిచే కోలాటం, 23 ఆదివారం నాడు భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తుల సహకారంతో భారీ విద్యుత్ దీపాలంకరణతో ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, కామేపల్లి బిల్డర్ షేక్ మనీషా బాషా, చతుకుపాడుకు చెందిన బేల్దారు మేస్త్రీ అద్దంకి నరసింహారావు వేరువేరుగా విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. కాగా 23న పాలపొంగళ్లతో ఉత్సవం ముగుస్తుంది. తిరునాళ్లకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు తదితరులు హాజరు కానున్నారు.

'కామేపల్లి' పోలేరమ్మ

భక్తుల విశ్వాసానికి ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

కొంతమంది పోలేరమ్మకు మొక్కుకొని వ్యాధి నయమయిన తర్వాత మొక్కుబడి తీర్చుకునేవారట. అప్పటి నుంచి ఇది ఆచారంగా కొనసాగింది. గ్రామీణ ప్రజల కోర్కెలు తీరడంతో స్థానికులు కాలక్రమేణా శిలల స్థానంలో విగ్రహాన్ని ప్రతిష్టించి ధ్వజస్తంభం ఏర్పాటు చేసి మరో గుడిని కట్టించారు. అప్పటినుంచి శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంగా అంచెలంచెలుగా అభివద్ధి చెందింది. గ్రామీణ ప్రజల కోర్కెలు తీర్చే కల్పతరువుగా పోలేరమ్మ తల్లిని కొలుస్తున్నారు. అప్పటినుంచి పోలేరమ్మకు క్రమం తప్పకుండా పూజలు నిర్వహిస్తున్నారు.

ఏ పని ప్రారంభించినా..

స్థానిక ప్రజలతో పాటు జరుగుమల్లి, టంగుటూరు, పొన్నలూరు, శింగరాయకొండ, కొండపి మండలాలు, కనిగిరి, కందుకూరు నియోజకవర్గాలలోని పోలేరమ్మ తల్లి భక్తులు ఏ పనిని ప్రారంభించాలన్నా తొలుత పోలేరమ్మ తల్లిని స్మరించుకుని ప్రారంభిస్తే పని విజయవంతంగా పూర్తవుతుందని విశ్వాసం. ఈ విశ్వాసంతోనే పలు గ్రామాలకు చెందిన ప్రజలు పోలేరమ్మ తల్లిని సందర్శించి మొక్కులు తీర్చుకోవటం ఆనవాయితీగా మారింది. భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 ఏళ్ల క్రితం జరుగుమల్లి మండలం వర్ధినేనిపాలెంకు చెందిన ఒక వర్తకుని ఇంట్లో దొంగలు చొరబడి.. బంగారం దోచుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష పైనే ఉంటుంది. బంగారం పోగొట్టుకున్న ఆ కుటుంబసభ్యులు తీవ్రంగా కలత చెందారు. స్థానికులు సూచన మేరకు ఆ కుటుంబం పోలేరమ్మ తల్లి గుడి వద్దకు వచ్చి తమ కోరికను వెలుబుచ్చి పూజలు నిర్వహించుకుని స్వగ్రామం చేరుకున్నారు. ఇది జరిగిన మూడో రోజు రాత్రి దొంగలపాలైన బంగారు నగలు ఆ వర్తకుని ఇంటిముందు నీటితొట్లో లభించినట్లు ఒక ప్రచారం ఉంది. దీంతోపాటు కామేపల్లి, కట్టుబడిపాలెం, కొండపి, రావులకొల్లు పొన్నలూరు, కందుకూరు తదితర గ్రామాలకు చెందిన వారి గహాల్లో బంగారు ఆభరణాలు, నగదు, చోరీకి గురైనవారు పోలేరమ్మ తల్లి గుడికి వెళ్లి వచ్చిన వెంటనే తిరిగి లభించటం వంటి ఘటనలతో భక్తులు అమ్మవారిపై నమ్మకం పెంచుకున్నట్లు స్థానికులు చెబుతారు. ఏ ప్రాంతం వారైనా కామేపల్లి వచ్చి పోలేరమ్మ తల్లిని సందర్శించుకుని వెళితే తమ కోర్కెలు తీరుతాయని భక్తుల అపారమైన నమ్మకం. మరో విశేషమేమిటంటే కామేపల్లి పరిసర ప్రాంతాలలో మద్యానికి బానిసలు అయిన వేలాది మంది పోలేరమ్మ గుడిని సందర్శించి కంకణ ధారణ ధరించి నిశ్చలమనస్సుతో అమ్మవారిని ప్రార్థిస్తే, వారు తిరిగి మద్యం జోలికి పోరని ఒక ప్రచారం ఉంది. ఈ పద్ధతిలో అనేకమంది మహిళలు మద్యానికి బానిసైన తమ భర్తలను, బంధువులను గుడికి తీసుకెళ్లి తిరిగి వెళ్లిన తర్వాత పూర్తిగా మద్యం అలవాటు మానుకున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అదేవిధంగా సంతానం లేని వారు, ఇతర కుటుంబ సమస్యలు ఉన్నవారు పోలేరమ్మకు మొక్కుకుంటే సమస్యలు పరిష్కారం అయినట్లు ప్రచారం ఉంది. ఇటువంటి ఘటనలతో పోలేరమ్మ తల్లికి ఈ ప్రాంత ప్రజల్లో ఆదరణ ఎక్కువగా ఉంది.



కామేపల్లి ప్రధాన కూడలి


పోలేరమ్మ తల్లి ఆలయంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


అతిథుల కోసం నిర్మించిన గెస్ట్ హౌస్


పోలేరమ్మ దేవాలయం


పోలేరమ్మ దేవాలయం వెనుక భాగం


శ్రీ పోలేరమ్మ తల్లి

కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి

దేవస్థానం దృశ్యాలు


కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం



ప్రస్తుత కామేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


దేవాలయ ప్రాంగణం లో వున్న బావి


భక్తులు పొంగళ్లు పెట్టుకొనేందుకు నిర్మించిన భవనం

మారనున్న పాలకవర్గం

ప్రజాశక్తి-జరుగుమల్లి



రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారం చేపట్టిన తరువాత వివిధ పాలక మండళ్లు మారనున్నాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో కామేపల్లిలోని శ్రీపోలేరమ్మ తల్లి దేవస్థానం చైర్మన్‌గా సూరంపల్లి కొండయ్యతో పాలకమండలి ఏర్పడింది. ప్రస్తుతం నూతన కమిటీ ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేయాల్సిఉంది. స్థానికులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పాలకవర్గ సభ్యులను నియామకానికి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు సమయం ఉన్నందున అధికారులు ప్రస్తుత పాలకవర్గం సమన్వయంతో తిరునాళ్ల నిర వ్యహిస్తున్నారు. రోజువారీ కార్య కలాపాలు, ఆలయ సేవలు తదితర వ్యవహారాలు దేవాదాయ శాఖకు చెందిన అధికార యంత్రాంగం పర్యవేక్షించడం ఆనవాయితీ. నిధుల సమీకరణ, ఆలయ అభివద్ధి పనుల కార్యకలాపాలన్నీ ధర్మకర్తల మండలిపైనే ఆధారపడి ఉంటుంది. గ్రామాల్లోని చిన్నచిన్న దేవాలయాలు మొదలుకొని టిటిడి, శ్రీశైలం లాంటి ప్రఖ్యాతిగాంచిన దేవస్థానాలు సైతం అభివద్ధి పర్యవేక్షణకు ధర్మకర్తల మండలే అత్యంత కీలకం. 2012లో దేవా దాయ శాఖలో విలీనమైన కామేపల్లిపోలేరమ్మ దేవస్థానానికి తొలిసారి చుండూరి వెంకటేశ్వర్లు చైర్మన్‌గా ధర్మకర్తల మండలి ఏర్పాటైంది. ఈ కమిటీ రెండేళ్లపాటు కొనసాగింది. 2014 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చింది.దీంతో టిడిపి ప్రభుత్వం కామేపల్లికి చెందిన ప్రముఖులు పావులూరి నాగేశ్వరరావు చైర్మన్‌గా రెండవ ధర్మకర్తల మండలిని నియమించింది. ఈ కమిటీ 2016 వరకు కొనసాగింది. ఈ కాలంలో పలు అభివద్ధి పనులకు కమిటీ శ్రీకారం చుట్టింది. ఆలయ మండపం, ముఖద్వారం, క్యూ కాంప్లెక్స్, ఆఫీసు నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్ తదితర వసతులతో పాటు తాగునీటి వసతులను కమిటీ ఏర్పాటు చేశారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో పలు అభివద్ధి పనులు చేపట్టారు. వాస్తవంగా ఈ రెండేళ్ళలోనే ఆలయ రూపురేఖలు మార్చడంలో కమిటీ విశేష కషి చేసింది. ఫలితంగా పోలేరమ్మ ఆలయానికి 6ఎ హెూదా కల్పిస్తూ దేవాదాయ శాఖ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోనే మోడల్ దేవస్థానంగా రూపుదిద్దే ప్రక్రియ జరిగింది. మరుగుదొడ్లు, ముఖద్వార నిర్మాణం వంటి పనులు పూర్తి చేశారు. మరో రూ.కోటి వ్యయంతో నిర్మించ తలపెట్టిన కాంపౌండ్ వాల్, పార్కింగ్ సౌకర్యం పూర్తి కావాల్సిఉంది. కొత్తగా ఏర్పడే పాలకవర్గం వీటిని పూర్తి చేసేందుకు కృషి చేయాల్సిఉంది.

'నిషేధం' చట్టానికే పరిమితం

యథేచ్ఛగా జంతువు వధ

ప్రజాశక్తి- జరుగుమల్లి

ప్రస్తుత ఆధునిక యుగంలోనూ కామేపల్లి పోలేరమ్మ గుడివద్ద 'జంతు బలి' ప్రక్రియ ముఖ్యమైన సాంప్రదాయంగా కొనసాగుతోంది. చట్టంలో జంతువధ నిషేధం అమలులో ఉన్నప్పటికీ అవేమి ఇక్కడ అమలు కావు. జిల్లాలోని అనేక ప్రాంతాలలోని దేవస్థానాల్లో ఈ సాంప్రదాయం ప్రముఖ పాత్ర పోషిస్తుంది. మూగ జీవాలను బలి ఇచ్చే సంప్రదాయం ఏమిటని కొంత మంది కొట్టిపారేస్తున్నా ఎవరూ కాదనలేని నిజం , ఆపలేని సాంప్రదాయం, నిరోధించలేని ఆచారం ఇక్కడ కొనసాగుతోంది. ఆదివారం వచ్చిందంటే పోలేరమ్మ గుడి ముందు ఎర్ర పూలుపరిచినట్లుగా నెత్తురు పారుతుంది. పోలేరమ్మ గుడి దగ్గర మూగ జీవాలను బలి ఇచ్చే సాంప్రదాయం ప్రజల్లో ఎంతలా పాతుకుపోయిందంటే ఎంతటి నిరుపేదలైనా తల్లీ తమ కోర్కెను మన్నిస్తే తమ స్థాయికి తగ్గట్టుగా చిన్న కోడిపిల్లనైనా నైవేద్యంగా సమర్పించు కుంటున్నారు. అనేక మంది భక్తులు తాము చేపట్టిన పని ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగితే పొట్టేళ్లు, మేకపోతులు నైవేద్యంగా చెల్లించుకుంటామంటూ మొక్కుకుని బలి ఇస్తుంటారు. గత 45 ఏళ్ళకు పైగా ఈ సాంప్రదాయం మరింత బలపడుతుందే కాని తగ్గుముఖం పట్టిన దాఖలాలు లేవు.



జంతువుల వధించేందుకు ఏర్పాటు చేసిన స్థలం

ఈ ఆచారం ఎలా మొదలైందంటే...

ఇంత బలీయంగా మారిన ఈ ఆచారం ఎలా మొదలైందనే వివరాల్లోకి వెళితే... 1970లో కామేపల్లికి చెందిన నరాల రామిరెడ్డి అనే వ్యక్తికి సంబంధించిన దాదాపు 50పొట్టేళ్ళను కందుకూరు మండలం కొండముడుసుపాలెం గ్రామస్తులు కొనుగోలు చేశారు. కొనుగోలులో భాగంగా రామిరెడ్డికి నగదు ఇచ్చే క్రమంలో రూ.10 నోట్లకు బదులుగా పొరపాటున రూ.20 నోట్ల కట్టలను ఇచ్చారట. వారు పొట్టేళ్ళను తీసుకుని కొండముడుసుపాలెం వెళ్ళిన తరువాతరోజు రామిరెడ్డికి డబ్బు ఎక్కువగా ఇచ్చినట్లు గుర్తించి వెంటనే వారు మరలా కామేపల్లి వచ్చి జరిగిన పొరపాటును రామిరెడ్డికి జరిగిన విషయం గురించి వివరించి ఎక్కువగా ఇచ్చిన డబ్బులును అడిగారంటా. అయితే రామిరెడ్డి అలాంటిదేమి లేదని, తనకు రావలసిన మేరకే డబ్బు ఇచ్చారనికొండముడుసుపాలెం వారికి చెప్పారట. రామిరెడ్డి మీద ఉన్న గౌరవంతో కామేపల్లి గ్రామస్తులు కూడా ఆయనకు ఎదురు మాట్లాడలేక పోయారు. చేసేదేమీ లేక పొట్టేళ్ళ కొనుగోలు దారులు తిరిగి తమ స్వగ్రామానికి వెళ్తూ పోలేరమ్మ గుడివద్దనున్న గ్రామపెద్ద పావులూరి నాగయ్యను కలిశారు. జరిగిన పొరపాటును వివరించి ఈ ఊరిలో తమకు అన్యాయం జరిగిందని నాగయ్య దష్టికి తెచ్చారు. దానికి నాగయ్య స్పందిస్తూ తమ ఊరిలో ఎవరికైన ఎలాంటి న్యాయం జరగాలన్నా పోలేరమ్మ తల్లేనని చెప్పారట. పొట్టేళ్ళ కొనుగోలు దారులు వెంటనే గుడిలోకి వెళ్ళి కొబ్బరికాయ కొట్టి తమ డబ్బులు తిరిగి వస్తే పొట్టేలును నైవేద్యంగా సమర్పిస్తామని అమ్మవారికి మొక్కుకుని తమ గ్రామానికి వెళ్లిపోయారు. ఆ మరుసటి రోజు నుంచి నరాల రామిరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శరీరమంతా మంటలు, మాట స్పష్టంగా రాకపోవడం, మనశ్శాంతి కరువై తీవ్ర అస్వస్తతకు లోనయ్యారు. రామిరెడ్డి జరిగిన తప్పును సరిదిద్దుకుంటానని మనసులో పోలేరమ్మ తల్లిని స్మరించుకోగా ఆయన ఆరోగ్యం కుదుట పడినట్లు స్థానికుల కథనం . మరుసటి రోజు వేకువఝామున రామిరెడ్డి నిద్రలేచి ఎవరికి తెలియకుండా ఒక్కడే కొండముడుసుపాలెం వెళ్లి తనకు ఎక్కువగా వచ్చిన డబ్బును పొట్టేళ్ళు కొనుగోలు చేసిన వారి గొర్లదొడ్డి వద్ద మంచం మీద పెట్టి కామేపల్లికి తిరిగి వచ్చాడట. తిరిగి వచ్చిన డబ్బు చూసి కొండముడుసుపాలెం వారు ఆనందంతో ఇదంతా అమ్మవారి మహిమగా భావించి నాలుగైదు ఎద్దుల బండ్లు కట్టుకుని కామేపల్లిలోని పోలేరమ్మ తల్లి గుడికి వచ్చి మొక్కు ప్రకారం నాలుగు పొట్టేళ్ళను అమ్మవారికి నైవేద్యంగా చెల్లించి పొంగళ్ళు పెట్టుకున్నారు. అప్పటినుంచి గుడికి వెళ్లిన వారిలో అత్యధిక మంది ప్రజలు ఇదే మొక్కులు మొక్కుకోవడంతో పాటు జీవాల నైవేద్య సాంప్రదాయం పోలేరమ్మ తల్లి గుడి వద్ద ఈ సంప్రదాయం కొనసాగుతున్నట్లు సమాచారం..

సెంటు భూమి కూడా కరువాయే..

ప్రజాశక్తి- జరుగుమల్లి

కామేపల్లిలోని శ్రీ పోలేరమ్మ తల్లి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ ప్రాంత ప్రజలకు ఇష్ట దేవతగా పేరుగాంచింది. ఎంతో ఆదరణ పొందినప్పటికీ భక్తులు నుంచి వచ్చే ఆదాయం మినహాయించి అమ్మవారికి స్థిరాస్తులు లేకపోవడం గమనార్హం. జిల్లాలోని ఇతర దేవస్థానాలతో పోల్చి చూస్తే పోలేరమ్మ తల్లి గుడి ఆదాయం అంతంత మాత్రంగానే ఉంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు డివిజన్ పరిధిలో కనీసం ధూప, దీప, నైవేద్యాలు కరువై అసలు ప్రాచుర్యంలో లేని దేవాలయాలు అనేకం ఉన్నాయి. ఆయా దేవస్థానాలకు సైతం వందల ఎకరాల భూమాన్యాలు ఉన్నాయి. ఆ భూములన్నీ దాదాపుఆక్రమణల చెరలో ఉన్నట్లుగా విమర్శలున్నాయి. ఆక్రమణలు పోను ఎంతో కొంత దేవస్థాన భూముల కౌలు రూపంలో కొంత నగదు ఆయా దేవాస్థానాలకు వస్తుంటుంది. పోలేరమ్మ తల్లి దేవస్థానానికి సెంటు భూమి కూడా లేదు. కేవలం దాతలు ఇచ్చి రెండెకరాల స్థలంలోనే దేవస్థానం విస్తరించ బడింది. ప్రస్తుతం దేవస్థానం గర్భగుడి, ముఖ మండపం విస్తరించింది.రోజు వారీ పూజా వేడుకలు ఇతర కార్యకలాపాలు జరిపేందుకు ఈ రెండెకరాల చోటు సరిపోక రైతులకు చెందిన భూములను వినియోగిస్తున్నారు. ఇక ఉత్సవాలు నిర్వహించాలంటే పర్యాటకుల రద్దీ కనుగుణంగా ఆలయ భూమి ఏ మాత్రం సరిపోదు. ఆ రోజు పార్కింగ్, ఇతర సంప్రదాయాలు,వ్యవరాలకు ప్రైవేటు భూములను వినియోగిస్తున్నారు. భూములు పడావుగా ఉంటే ఫరవాలేదు. పంటలు వేస్తే ఇక అగచాట్లే.. భూములు ధరలు విపరీతంగా పెరగడంతో దేవస్థానానికి భూమి విరాళంగా ఇవ్వడానికి ఎవ్వరూ ముందుకు రాని పరిస్థితి. పాలకమండలి కొనుగోలు చేయడానికి నిబంధనలు అంగీకరించవు, పైగా ఆదాయం అంతంత మాత్రం. హుండీ ఆదాయం, కంకణ ధారణం, వాహన పూజలు ,షాపుల వేలం పాటలు ద్వారా మాత్రమే వచ్చే ఆదాయంతోనే ఆలయ సిబ్బంది జీతభత్యాలకు వెచ్చిస్తున్నారు. లడ్డూ ప్రసాదం బయట ప్రైవేటు వ్యక్తుల ద్వారా తయారు చేయిస్తున్నారు. లడ్డూ ప్రసాదం ద్వారా వచ్చే ఆదాయం తయారీకే సరిపోతున్నట్లు సమాచారం. ఎంతో ఆదరణ పొందిన ఈ దేవస్థానానికి అదనంగా భూమి కేటాయిస్తే మరింత అభివద్ధి చెందే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.



పోలేరమ్మ దేవస్థానం

ఉపాధి పనులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి -టంగుటూరు

ఇటీవల కురిసిన వర్షాలు, ఇతల కారణాల రీత్యా పలు ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిచి పోయాయని, నిలిచిన పనులను వెంటనే ప్రారంభించి వేతన దారులను ఆదుకోవాలని కోరుతూ ఎపిఒ సుభాషిణికి వ్యసాయ కార్మిక సంఘం నాయకుడు వి. మోజెస్ శుక్రవారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ వేసవిలో నేల గట్టిగా వుండి గడ్డ పార దిగదు కాబట్టి గతంలో సమ్మర్ అలవెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల దాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. సమ్మర్ అలవెన్స్‌ను తిరిగి కొనసాగిచాలని ఆయన కోరారు. సంవత్సరాల తరబడి పని ముట్లు ఇవ్వడం లేదని తెలిపారు. టెంట్లు మెడికల్ కిట్లు అందుబాటులో లేవన్నారు. పేస్లిప్పులు ఇవ్వడం లేదన్నారు. మజ్జిగ, గడ్డ పారల పదునకు నగదు ఇవ్వలేదన్నారు. వాటన్నింటినీ పునర్ధరించాలని కోరారు. ఉపాధి హామీ చట్టానికి రూ .రెండు లక్షల కోట్లు కేటాయించాలని కోరారు. వ్యవసాయ రంగం దివాళా తీయటం, యాంత్రీకీకరణ పెరగటంతో పనులు తగ్గి, పేదలు పొట్ట చేత పట్టుకొని వలసలు పోతున్నారు. ఈ పరిస్థితులలో ఉపాధి హామీ పనులు ఉండబట్టే పేదలు ప్రాణాలు నిలబెట్టు కుంటున్నారన్నారు. ఉపాధి పనులకు గతంలో ఇచ్చిన ప్రోత్సహకాలు కల్పించి నిధులు పెంచి ప్రజలను ఆదుకోవాలని కోరారు.



ఎపిఒకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

డిమాండ్లు ఇవే...

ఆగిన చోట పనులు పునరుద్ధరించాలి. సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలి. మంచి నీళ్ళ, మజ్జిగ సౌకర్యం కల్పించాలి. 30 రోజులు పని చేసిన ప్రతి కుటుంబానికి పనిముట్లు, ప్రతి గ్రూపుకు టెంట్, మెడికల్ కిట్ అందజేయాలి. ప్రని ప్రదేశంలో వేతనదారులు మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి. కేంద్ర బడ్జెట్ లో ఉపాధి హామీ చట్టానికి రూ.2లక్షల కోట్లు కేటాయించాలి. ప్రతి కుటుంబానికి 200 రోజుల పనిదినాలు కల్పించాలి. రోజు వారీ కూలీ రూ.600 ఇవ్వాలని, ఉపాధి పనుల్లో అవి నీతిని అరికట్టాలి. దరఖాస్తు చేసుకున్న ప్రతి వారికి పనులు కల్పించాలి. లేక పోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి, పాత బకాయిలు, పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి పత్రం మోజెస్ డిమాండ్ చేశారు.

యోగా సాధనతో ఆరోగ్యకర జీవనం : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యోగాసనాల సాధనాతో ఆరోగ్యకరమైన జీవనంతోపాటు సమాజంలో ఆత్మ స్థైర్యంతో జీవించడానికి వీలుంటుందని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లా జైలులో జైలు సూపరింటెండెంట్ వరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో 10వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో కలెక్టర్, ఎస్పి గరుడ్ సుమిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎస్పి, జైలు శాఖ అధికారులు, ఆయుష్ అధికారులు, ఖైదీలు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను జిల్లా జైలు లో నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇటీవల 3200 మంది స్కూల్ విద్యార్థులతో ఒక గంటా 45 నిమిషాల పాటు విరామం లేకుండా పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 108 సార్లు సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధించారన్నారు. ఎస్పి గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ యోగా సాధనతో ఖైదీ సోదర్లల్లో ఉత్సాహం కనిపిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సుపరింటెండెంట్ వరుణ్ రెడ్డి, జైలర్ రమేష్, డిపార్ట్మెంట్ ఎస్ఎంఒ డాక్టర్ భ్రమరాంబ, జిజిహెచ్ ఆర్ఎంఒ డాక్టర్ చైతన్య వర్మ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భీమ్ నాథ్,ఎంఇఒ కిషోర్ బాబు పాల్గొన్నారు.

శింగరాయకొండ : శింగరాయకొండలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపా ధ్యాయురాలు కె. మహాలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాభారతి ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పి.విజయ్ కుమార్ మాట్లాడుతూ యోగా ఒక భౌతిక సంబంధమైన క్రియ మాత్రమే కాకుండా ఆధ్యాత్మికంగా కూడా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. భూత:, భవిష్యత్తు కాలాల కంటే వర్తమాన కాలాన్ని ప్రాధాన్యతతో చూసి తద్వారా విద్యార్థులలో వారివారి చదువుల పట్ల ఏకాగ్రతను పెంపొంది స్తుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కె.మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కువ మంది డి విటమిన్ లోపంతో బాధపడుతున్నట్లు తెలిపారు. రోజులో కొద్ది భాగం సూర్యరశ్మిలో గడపాడం ద్వారా డి విటమిన్ లోపాన్ని అధిగమించవచ్చునని తెలిపారు. అందులో భాగంగానే విద్యార్థినులకు ఉదయం పూట ప్రార్ధనా కార్యక్రమాన్ని ఆరు బయట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు అందరినీ ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎల్.లావణ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా పాకల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోఏాధ్యాయులు ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి. హాజరతయ్య ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శింగరాయకొండలో యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

టంగుటూరు : యోగాతో ఆర్యోగంగా జీవించవచ్చుని పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు అనూరాధ తెలిపారు. జరుగుమల్లి మండలం కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యత, మానవ జీవన విధానంపై యోగా ప్రభావం, సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధియోగా తోడ్పడే విదానాన్ని గురించి వివరించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు నర్రా కోటేశ్వరరావు యోగాసనాలు ప్రదర్శించి వాటి ఉపయోగాల గురించి వివరించారు

నాగులుప్పలపాడు : యోగాతో మానసిక ఉల్లాసం, ఆత్మవిశ్వాసం కలుగుతుందని ఎన్‌సిసి అధికారి వెంకటప్పయ్య తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివిధ గ్రామాల్లో యోగాసనాలు నిర్వహించారు. నిడమానూరు కూనం రామిరెడ్డి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఎన్‌సిసి విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు ఈ సందర్భంగా వెంకటప్పయ్య మాట్లాడుతూ యోగాతో శారీరక మానసిక ఉల్లాసం పెంపొం దుతుందన్నారు యోగాను పాఠ్యాంశంగా పొందు పరచాలన్నారు. అదేవిధంగా అమ్మనబ్రోలు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో పీడీ కష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు ప్రదర్శించారు.

మలేరియా మాసోత్సవాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బాలయోగినగర్‌లో మలేరియా మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉజ్వల ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. అనంతరం డాక్టర్ ఉజ్వల మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రం తో పాటు ఇంటి ఆవరణలో కుండీలు, టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీటి సంపులపై మూతలు పెట్టాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులకు దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సాంబశివరావు, ఆరోగ్య పరిరక్షకులు సయ్యద్ మసూద్అలీ, మలేరియా సబ్ యూనిట్ అధికారి భాస్కర్, భారతి, నసీమోన్, సుభాకర్, వార్డు సభ్యుడు గంజి సుబ్బారావు, ఆశా కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ముగిసిన ఎడ్ల పోటీలు

సత్తా చాటిన తాడేపల్లి మండలం మించలపల్లి ఎడ్ల జత

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ శ్రీవరాహలక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం మించలపల్లి గ్రామానికి చెందిన పిఆర్ మెమోరియల్ పులిహోర త్రివేశ్వర్ రెడ్డి, జాస్మిత రెడ్డి ఎడ్ల జత మొదటి బహుమతిని సాధించింది. విజేతలకు టిడిపి మండల అధ్యక్షుడు వేల్పుల శింగయ్య రూ.70 వేల నగదు మెంమోటో అందజేశారు. నంద్యాల జిల్లా పిరిమెళ్ళ మండలం సంపర మాబు దీన్నే గ్రామానికి చెందిన కుందూరు రాంభూపాల్ రెడ్డి జత ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు రూ.50 వేల రూపాయల బహుమతిని జిఎస్‌కె కల్యాణ మండపం అధినేత గంజి ప్రసాద్ అందజేశారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలానికి చెందిన ఆర్కే బుల్స్ నరసింహ సింహాద్రి,అత్తోట శిరోపా చౌదరి, శివ కష్ణ చౌదరి ఎడ్లజత తృతీయ స్థానంలో నిలిచింది. విజేతలకు శింగరాయకొండ అయ్యప్ప నగర్ చెందిన బాపట్ల బ్రదర్స్ రూ.40 వేల నగదు అందజేశారు. కష్ణా జిల్లా ఘంటసాల మండలానికి చెందిన ఎంకెఎం బుల్స్ మేక కష్ణమోహన్ ఎద్దుల జత నాల్గో స్థానంలో నిలిచింది. విజేతలకు రూ. 30 వేల నగదును చవిడి బోయిన మురళి, దాసరి శేషయ్య, సంపతి కోటేశ్వరరావు, పిగిలి శివ అందజేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావుకు చెందిన నందమూరి తారక రామారావు బుల్స్ ఎడ్ల జత ఐదో స్థానం నిలిచింది. విజేతలకు చిమటా మాధవ, చిమటా మాలకొండయ్య రూ.20వేల నగదును బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మించాల బ్రహ్మయ్య, ఉప సర్పంచి నక్క బ్రహ్మేశ్వరరావు, లోటస్ స్కూల్ అధినేత నక్కా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భక్తులకు 'నాణెం'పై నమ్మకం



నాణెలు అంటిస్తున్న భక్తులు

ప్రజాశక్తి- జరుగుమల్లి

కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం వద్ద భక్తులకు 'నాణెం' నమ్మకం అధికంగా ఉంది. దేవస్థానానికి వచ్చిన యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రదక్షిణలు చేసే సమయంలో దేవస్థానం వెనుక గోడపై నాణేన్ని అతికించేందుకు పోటీపడతారు. ఆ నాణెం ఎక్కువ సేపు దేవస్థానానికి అతుక్కుంటే తమ కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. ప్రకాశం జిల్లానే కాకుండా పొరుగు జిల్లాలైనా నెల్లూరు, గుంటూరు, కడప జిల్లాల నుంచి భక్తులు ఇక్కడికి అధికంగా వస్తారు. వారంలో మూడు రోజులు దేవాలయం దర్శనానికి పోటీపడతాయ. మంగళవారం, శుక్రవారం, ఆదివారాల్లో జనం వేలాదిగా ఇక్కడికి తరలివస్తారు.

మత సామరస్యానికి ప్రతీక..




ప్రజాశక్తి- జరుగుమల్లి

మతసామరస్యానికి, మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రతీకగా నిలిచారు. అన్ని మతాలు సమానం అని.. అన్ని మతాచారాలను గౌరవించాలంటారాయన. ఆయన పేరు ఎస్‌కె. బాషా. ఆయన పుట్టింది.. పెరిగింది.. మండలంలోని కామేపల్లిలోనే.. పూర్తి గ్రామీణ వాతావరణ నేపథ్యంలో పెరిగిన ఆయన స్థానికంగా నిర్వహించే పలు కార్యక్రమాలకు హాజరు కావడం ఆయన నైజం. వందేళ్ల కిందట వెలసిన కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయాన్ని ప్రతి సందర్భంలో తన మిత్రులతో కలిసి సందర్శించడం చిన్నతనం నుంచే అల వడిందంటారు. ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. సుమారు 25 ఏళ్ల కిందట బిల్డర్‌గా హైదరాబాద్‌లో స్థిరపడిన ఆయన ఏదయినా కొత్త వాహనాన్ని కొనుగోలు చేసినా, కొత్త పని తలపెట్టినా పోలేరమ్మ ఆలయంలో పూజా కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. తాను అనుకున్న కోర్కెలు తీర్చిన ఆశీస్సులు అందిస్తున్న తల్లిగా ఆయన విశ్వసిస్తున్నట్లు బాషా ప్రజాశక్తికి తెలిపారు. 2012లో తనకు ఆర్థిక పరిస్థితి సహకరించకున్నప్పటికీ తాను విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశానని తెలిపారు. ఇదే ఆనవాయితీని ఈ ఏడాది కూడా కొనసాగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. స్థానికంగా వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం నిర్మాణానికి ఆయన రూ. 1లక్ష విరాళంగా అందించినట్లు స్థానికులు తెలిపారు.



పోలేరమ్మ తల్లి అమ్మవారు



స్థల పురాణం తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డు



ఆలయ ముఖద్వారం

పోలేరమ్మ ఆలయ దృశ్య మాలిక



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పోలేరమ్మ ఆలయం



అభివృద్ధి పనులను శిలా ఫలకం

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా

ఏలూరి రాంబాబు, మాజీ సర్పంచి,కామేపల్లి



ప్రజాశక్తి-జరుగుమల్లి

కామేపల్లి శ్రీపోలేరమ్మ తల్లి ఆలయ అభివద్ధికి తనవంతు సహకారం అందిస్తానని గ్రామానికి చెందిన మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు స్పష్టం చేశారు. పోలేరమ్మ తల్లి ఆశీస్సులతో ఈ పాటికే పలు అభివద్ధి పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కామేపల్లిని టూరిస్టు కేంద్రంగా రూపుదిద్దేందుకు రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, మిత్రులు పావులూరి నాగేశ్వరరావు. గంటా చిరంజీవి సహకారంతో కషి చేస్తామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నపాఠశాలను జూనియర్ కళాశాలగా అభివద్ధి చేసినట్లు తెలిపారు. మంత్రి సహకారంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అభివద్ధి చేసినట్లు తెలిపారు. పట్టణ స్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు సర్పంచి సహకారంతో కషి చేస్తామన్నారు. తాగునీటి వసతికి పైప్ లైన్ నిర్మాణంతో పాటు ఆర్‌ఒ ప్లాంట్లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలోని వీధుల్లో ఎస్‌ఇడి బల్బులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మున్సిపల్ స్థాయిలో హైలెవల్ హైజెనిక్ ల్యాంప్స్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామం మొత్తం సిమెంట్ రోడ్లతో అభివద్ధి పరిచినట్లు తెలిపారు. ఫైబర్ కేబుల్ వ్యవస్థ ద్వారా గ్రామం నుంచి పోలేరమ్మ దేవస్థానం వరకు విద్యుత్ వసతి కల్పించినట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ నుంచి పోలేరమ్మ దేవస్థానం వరకూ డివైడర్లను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. పర్యాటకులకు ప్రత్యేకించి దేవస్థానం ప్రాంగణంలో ఆర్‌ఒ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భవిష్యత్తులో దేవస్థానాన్ని మోడల్ ఆలయంగా రూపుదిద్దేందుకు తామంతా కషి చేస్తామని ఏలూరి తెలిపారు.

నిస్వార్థంగా సేవలందించా..

పావులూరి నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్



ప్రజాశక్తి- జరుగుమల్లి

తన పదవీ కాలంలో కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ అభివద్ధికి నిస్వార్థంగా సేవలందించినట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పావులూరి నాగేశ్వరరావు వెల్లడించారు. 2012లో దేవాదాయశాఖలో విలీనమైన దేవస్థానానికి 2014 లో రెండవ కమిటీకి చైర్మన్ తాను వ్యవహరించానన్నారు. 2014 నుంచి 2016 వరకూ రెండేళ్ల కాలంలోనే ఆలయ రూపురేఖలు మార్చేందుకు తన శక్తి వంచన లేకుండా కషి చేసినట్లు తెలిపారు. దీని కోసం కొండపి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, రాష్ట్ర మాజీ మంత్రి గంటా శ్రీనివాస రావు నిధులు మంజూరు చేయడంలో పాటు తోడ్పాటునందించినట్లు వివరించారు. తన మిత్రుడు కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు బాషా , గ్రామ పెద్దలు సంపూర్ణ సహకారం అందించారన్నారు. గుడిగోపురం, ఆలయ మండపం, క్యూ కాంప్లెక్స్, కార్యాలయ నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, సిమెంట్ రోడ్లు, తాగునీటి సౌకర్యం లాంటి అభివద్ధి పనులు చేపట్టామన్నారు. పర్యాటకులకు వసతులను మెరుగుపరిచే దిశగా రూ.నాలుగు లక్షల వ్యయంతో పది మరుగుదొడ్లు, పది స్నానపు గదుల కాంప్లెక్స్ , ఆలయానికి పడమర వైపున చేపట్టిన ప్రహరీ, గెస్ట్ హౌస్ వంటి పనులు పూర్తి చేశామన్నారు. తాను పదవిలో లేకున్నప్పటికీ ఆలయ అభివద్ధికి ఎప్పటిలానే సహకారం అందిస్తానని ప్రకటించారు.

నిధుల గోల్ మాల్ పై విచారణ

- రూ.36 లక్షల అవినీతి
- రూ.18 లక్షలు జమ
- ఇఒఆర్‌డి రఘు వెల్లడి



కార్యదర్శులను విచారిస్తున్న ఇఒఆర్‌డి రఘు

ప్రజాశక్తి - మద్దిపాడు

పబ్లిక్ వాటర్ స్కీమ్‌లో జరిగిన నిధుల గోల్‌మాల్ పై అధికారులు విచారణ చేపట్టారు. 2021 నుంచి 2024 ఏప్రియల్ వరకూ పని చేసిన కార్యదర్శులను శుక్రవారం దొడ్డవరం పంచాయతీకి పిలిపించి విచారణ నిర్వహించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిపిఒ ఉషారాణి, డిఎల్‌పిఒ ఆర్.పద్మ ఆదేశించారు. దీంతో గత వారం రోజులుగా ఇఒపిఆర్‌డి దొడ్డవరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. మొత్తం రూ.36 లక్షలు 2021 జూన్ నెల నుంచి ఏప్రియల్ 2024 వరకూ నిధులు గోల్ మాల్ జరిగిందని ఇఒపిఆర్‌డి కె.రఘుబాబు లెక్కలు తేల్చారు. దొడ్డవరం పంచాయతీ సర్పంచి, అప్పటి గ్రామ కార్యదర్శి జానీబాషా కలిసి పబ్లిక్ వాటర్ స్కీమ్ దొడ్డవరం పేరుతో ప్రైవేటుగా స్థానిక యూనియన్ బ్యాంక్‌లో 0798120140000246 నంబరుతో ఖాతా ప్రారం భించారు. 14 వార్డు మెంబర్ బి.వెంకట్రావు నీటి పన్ను వసూలు కోసం తన భార్య అలేఖ్యను నియమించుకున్నారు. 2021 జూన్ నుంచి 2021 నవంబర్ వరకూ రూ.6,67,150 డబ్బు వసూలు చేశారు. రూ.1,26,000 అకౌంట్‌లో జమ చేశారు. 2021 డిసెంబర్‌లో రూ.76,150 వసూలు చేశారు. దానికి కొంత కలిపి రూ.88,000లు జమ చేశారు. 2022 జనవరిలో రూ.1, 40,600 వసూలు చేశారు. రూ.41,600 జమ చేశారు. ఫిబ్రవరిలో రూ.41,100 వసూలు చేయగా రూ.4,800 మాత్రమే జమ చేశారు. 2022 మార్చి నుంచి జులై నెల వరకూ రూ. 3,60,400 వసూలు చేయగా రూ.1,01, 403 జమ చేశారు. 2022 అగస్టు నుంచి అక్టోబర్ వరకూ రూ.2,46,550 వసూలు చేయగా రూ.1,24,500 జమ చేశారు. 2022 నవంబర్ రూ.1,92,150 వసూలు చేయగా రూ.71,500 జమ చేశారు. 2022 డిసెంబర్‌లో రూ.1,94,650 వసూలు చేయగా రూ.1.92,000 జమ చేశారు. 2023 జనవరి నెలలో రూ.8,07.250 వసూలు చేయగా రూ.2,33,000లు జమ చేశారు. 2023 ఫిబ్రవరి నెలలో రూ.1,62, 250 వసూలు చేయగా రూ.1,07,500 జమ చేశారు. 2023 మార్చి నుంచి ఏప్రియల్ 2023 జూన్ 18 వరకూ రూ.3,67,800 పూర్తిగా జమ చేయలేదు. పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ బాషా, గ్రామ సర్పంచి ఆ నగదును తమ సొంతానికి వినియోగించు కున్నట్లు నిగ్గు తేల్చారు. 2023 జూన్ 19 నుంచి 2024 మార్చి 15 వరకు విధులు నిర్వహించిన పంచాయతీ టి.అజయ్ కీర్తి, వార్డు మెంబర్ భార్య పేరున రూ.8 లక్షల వరకూ నీటి వసూలు చేసి ఆనిధులు ప్రైవేటు, పంచాయతీ రాజ్ శాఖ ఆమోదం పొందిన బ్యాంకు ఖాతాలో జామ చేయకుండా తమ సొంతానికి వినియోగించు కున్నట్లు ఇఒపిఆర్ రఘుబాబు తెలిపారు. గత వారం రోజుల క్రితం ఇచ్చిన నోటీసులకు స్పందించిన అజయ్ కీర్తి వారం రోజులలో పలు విడతలగా రూ.8 లక్షలు జమచేసినట్లు ఆయన తెలిపారు. నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో సర్పంచి కీలక పాత్ర పోషించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచి సుబ్బారావు, వార్డుమెంబర్ వెంకట్రావును 24న విచారణకు హాజరు కావాలని ఆదేశించినట్లు ఇఒపిఆర్‌డి తెలిపారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

చీమకుర్తి మండలం మువ్వావారిపాలెం పంచాయతీ పరిధిలోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అప్పనబోయిన శ్రీనివాసరావు విద్యా సామగ్రి సమకూర్చారు. గ్రామ సర్పంచి బొడ్డు రవిబాబు చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు,అట్టలు,పలకలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ విద్యార్థులకు విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యా సామగ్రి అందజేసిన ఉపాధ్యా యుడు శ్రీనివాసరావు అభినందనీ యుడన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు మాదాల హనుమంతరావు, ప్రధానోపాధ్యా యుడు శంకరరెడ్డి, సుజిత, ఉపాధ్యాయులు ఎం. వెంకటరావు, గ్రామస్తులు మోహనరావు, వెంకటేశ్వర్లు ,బ్రహ్మయ్య పాల్గొన్నారు.

రూ.20 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-శింగరాయకొండ

లివర్ సమస్యతో భాదపడుతూ విజయవాడ రెయిన్బో చిన్నపిల్లల హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కందుకూరు చెందిన షేక్ ఆర్మన్ వైద్య నిమిత్తం శింగరాయకొండ గీతం డిజిటల్ స్కూల్ కరస్పాండెంట్ లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపల్ తాజ్, ఇన్‌ఛార్జి రాణి, అకడమిక్ ఇన్‌ఛార్జి నాగమణి, సాయి అరుణ, షాజ, ఖాజాబి చేతుల మీదుగా రూ.20వేల నగదును శుక్రవారం అందజేశారు. భవిష్యత్‌లోనూ ఆర్మన్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

'సికిల్ సెల్' పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కనిగిరి

గిరిజన ప్రాంత ప్రజలు సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి పట్ల అవగాహన కలిగి అప్రమత్తం గా ఉండాలని కనిగిరి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రియదర్శానంద తెలిపారు. కనిగిరి పట్టణంలోని గిరిజన కాశిరెడ్డి కాలనీలో కొండ ప్రాంతంలో నివసించే గిరిజనులు సికిల్ సెల్ ఎనిమియా నిర్ధారణకు రక్త పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనిమియా వ్యాధి చోకిన వారికి రక్త కణాలు తగ్గడం, కళ్ళ పసుపు రంగులోనికి మారడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సచివాలయ హెల్త్ సెక్రటరీ లక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి చౌటపాలెం, దాదా నాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, రామాయపాలెం, దాసిరెడ్డిపాలెం, కొండపి గ్రామాలకు చెందిన రైతులు 1,308 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,227 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 81 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.335, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.314.99 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి పొందూరు గ్రామానికి చెందిన రైతులు 926 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 878 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 48 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ. 335, అత్యల్ప ధర రూ. 205, సరాసరి ధర రూ. 280-51 పైసలు పలికింది.

ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కొండపి

ఆంద్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో టైలరింగ్, డొమెస్టిక్ డేటా ఎంట్రి ఆపరేటర్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ డిఎస్‌డిఒ జె.రవితేజ తెలిపారు. టైలరింగ్‌లో శిక్షణ పొందేవారికి పదో తరగతి, ఐటిఐ విద్యార్హత ఉండాలన్నారు. 16 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. డోమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు పదవ తరగతి, ఆపై తరగతులు చదివిన వారు అర్హులని తెలిపారు. వయస్సు 16 నుంచి 40 సంవత్సరాలు ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 25లోపు కొండపి జూనియర్ కళాశాలలో తమ పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

'నేను బడికి పోతా' పై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి –కొండపి

బడి బటయ ఉన్న పిల్లను గుర్తించి వారు పాఠశాలకు వెళ్లేలా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహశీల్దారు బి.కిరణ్‌కుమర్ తెలిపారు. నేను బడికిపోతా, చిన్న పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో, బడి మానేసిన పిల్లల్ని స్కూల్లో చేర్పిద్దామంటూ తహశీల్దారు కార్యాలయం నుంచి ప్రభుత్వ హైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ తల్లిదండ్రులు చిన్నారులకు బడికిపంపించేవిదంగా చూడాలన్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపిడివో నాగమణి, సిడిపిఒ మాధవీలత, విక్టోరియా రాణి, ఎంఇఒలు కె.సురేఖ, రామారావు , పంచాయతీ కార్యదర్శి, విఆర్ఒలు, అన్ని శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని అమ్మనబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నేను బడికి పోతా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపా ధ్యాయరాలు సత్యవతి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఇఒ టి. రవి మాట్లాడుతూ 6 నుంచి 14 సంవత్సరాల వయసు గల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఎంఇఒ-2 రమణయ్య మాట్లాడుతూ బడికి పోయే పిల్లలు బాల కార్మికులుగా మారకుండా తల్లిదండ్రులు చైతన్యం కలిగి ప్రతి ఒక్కరిని పాఠశాలలలో చేర్పించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలుఏ సత్యవతి మాట్లాడుతూ 5 సంవత్సరాల పైబడి వయసు కలిగిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ బ్రహ్మయ్య , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ మహలక్ష్మి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యత మన అందరి బాధ్యత అని తెలిపారు. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు రవికుమార్, రమణయ్య, సిఆర్‌పిలు ఎడ్యుకేషన్ ,వెల్ఫేర్ అసిస్టెంట్లు,అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ,హాస్టల్ వార్డెన్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పిసిపల్లి : నేను బడికి పోతా అనే కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బడికి పోవాలని చదువుకోవాలన్నారు. అందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పద్మావతి, ఎంఇఒ శ్రీనివాసులు, ఎపిఒ సుబ్బారావు, ఎపిఎం సత్యానందం , పంచాయతీ కార్యదర్శులు మరియు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొత్తపట్నం : బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాల్సిన బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని ఇఒఆర్‌డి బాల చెన్నయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పద్మావతి అధ్యక్షతన నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడుతూ బాల చెన్నయ్య మాట్లాడుతూ ఆరు నుంచి పది సంవత్సరాల లోపు పిల్లలను గుర్తించి బడి మానుటకు గల కారణాలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలన్నారు. ఆ విద్యార్థులను బడిలో చేర్పించి అన్ని వసతులతో కూడిన ఉచిత విద్యనందించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి బందంలో ఎంపిడిఒ, తహశీల్దారు, ఎంఇఒ, సిడిపిఒ, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, హాస్టల్ వార్డెన్లు ఉంటారన్నారు. బడి ఈడు పిల్లలను గుర్తించడంలో విద్యాశాఖ, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ- 1 తులసి కుమారి, ఎపిఎం రజియా సుల్తానా బేగం, అల్లూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దర్శి : నేను బడికి పోతా కార్యక్రమంపై తాళ్ళూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కె.యుగకీర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్‌రావు, మూర్తి, సిడిపిఒ భారతి, కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు శేషగిరి, సుజిత, ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నేను బడికి పోతా కార్యక్రమములో భాగంగా బడి వయసు గల పిల్లలను మరియు బడిబయటి పిల్లలను బడిలో చేర్పించుటకు కలెక్టర్ ఆదేశాల మేరకు తాళ్ళూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ కె.యుగకీర్తి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్‌రావు, మూర్తి, సిడిపిఓ భారతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శేషగిరి, కెజిబివి సుజిత, ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు : ఎంపీడీవో కార్యాలయంలో నేను బడికి పోతా కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ అర్హులైన పిల్లలు100 శాతం పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల వయసుగల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ తిరిగి పాఠశాలలో చేర్పించే విధంగా ప్రతి ఒక్కరు కషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-1 ఆంజనేయులు, ఎంఇఒ- 2 శ్రీనివాసరావు, వెలుగు సీసీలు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు, వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.


హృదయపూర్వక స్వాగతం...
ప్రకాశం జిల్లా లో ప్రసిద్ధి గాంచిన...
కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ళ
ఉత్సవాలకు విచ్చేయుచున్న
రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు
డాక్టర్ డోలా
శ్రీబాలవీరాంజనేయస్వామి గారికి
ప్రజాప్రతినిధులకు....
హృదయ పూర్వక స్వాగతం...
కోట శ్రీహరి
అసిస్టెంట్ ఇంజనీర్, పంచాయతీ రాజ్
టంగుటూరు - జరుగుమల్లి


భక్తజనులకు
హృదయ పూర్వక స్వాగతం...
ప్రకాశం జిల్లా లో ప్రసిద్ధి చెందిన
కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ళ
ఉత్సవాలకు విచ్చేయుచున్న
అతిరథ మహారథులకు
హృదయ పూర్వక స్వాగతం....
శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానం పూర్వ కమిటీ
కామేపల్లి
జరుగుమల్లి మండలం - ప్రకాశం జిల్లా
పావులూరి నాగేశ్వరరావు
మాజీ ఛైర్మన్


హృదయ పూర్వక స్వాగతం
ప్రకాశం జిల్లాలో ప్రశస్తమైన...జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో
వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లి ఉత్సవ కార్యక్రమానికి విచ్చేయుచున్న...
అశేష ప్రజానీకానికి హృదయపూర్వక స్వాగతం....
మా వద్ద పెళ్ళిళ్ళు- తిరునాళ్ళు- శుభకార్యాలకు -
వేడుకలకు అవసరమైన అన్ని రకముల్లైన
టపాసులు హోల్ సేల్ ధరలకు లభించును....
పోలేరమ్మ క్రాకర్స్
కామేపల్లి - టంగుటూరు రోడ్డు
జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా
K. భాస్కర్
K. సురేష్


కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి అమ్మవారి
తిరునాళ్ళ మహోత్సవమునకు
విచ్చేయుచున్న భక్తులకు, నాయకులకు, కార్యకర్తలకు
స్వాగతం
సుస్వాగతం
మీ...
అద్దంకి నరసింహారావు శ్రీమతి జ్యోతి


భక్తజనులకు
హృదయ పూర్వక స్వాగతం ...
భక్తుల కోర్కెలు తీర్చే తల్లి...
ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధి చెందిన..
కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి
తిరునాళ్ళ ఉత్సవాలకు
విచ్చేయుచున్న అశేష భక్తజనులకు
హృదయ పూర్వక స్వాగతం....
సూరంపల్లి కొండయ్య, ఛైర్మన్
శ్రీపోలేరమ్మ తల్లి దేవస్థాన కమిటీ - కామేపల్లి
జరుగుమల్లి మండలం - ప్రకాశం జిల్లా


భక్తజనులకు
హృదయపూర్వక స్వాగతం...
తెలుగు రాష్ట్రాల ప్రజల ఆరాధ్య దేవత....
గ్రామీణ ప్రజల ఆశలు నెరవేర్చే తల్లి...
కామేపల్లి(జరుగుమల్లి) శ్రీ పోలేరమ్మ తల్లి ...
ఉత్సవాలకు విచ్చేయుచున్న అశేష జనావళికి
హృదయ పూర్వక స్వాగతం....
శ్రీ పోలేరమ్మ తల్లి ఆలయ పాలకవర్గం..
కామేపల్లి
జరుగుమల్లి మండలం - ప్రకాశం జిల్లా


హృదయపూర్వక స్వాగతం
కోరిన కోర్కెలు తీర్చే తల్లి.. కామేపల్లి శ్రీపోలేరమ్మ తల్లి ...
ఉత్సవాలకు విచ్చేయుచున్న అశేష జనావళికి హృదయ పూర్వక స్వాగతం....
సహస్ర A1 నవోదయ అకాడమీ
-8 సం.ల నుండి హాజరైన 30మందికి నవోదయ సీట్లు .
4వ తరగతి నుండి ప్రత్యేక శిక్షణ .
-15 సం.ల పైబడి అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే శిక్షణ.
సహస్ర A1 ఒలంపియాడ్ అకాడమీ
-3నుండి 5తరగతుల వారికి ప్రత్యేక శిక్షణ.
-సివిల్స్, లా,CA వంటి కోర్సుల పట్ల అవగాహన కల్పించడం.
-జాతీయ స్థాయి పరీక్షలకు పరిచయం చేయుట.
సహస్ర A1 IIT అకాడమీ
-6నుండి 8తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ.
-అత్యుత్తమ ఉపాధ్యాయులచే శిక్షణ.
-ప్రతి వారం ప్రోగ్రెస్ రివ్యూ, ప్రతిభకు పట్టం.
-క్లిష్టమైన కాన్సెప్ట్ పై ఎక్కువ సాధన.
సహస్ర A1 కిండర్ గార్డెన్
-ఆటపాటలతో కూడిన విద్య.
-ప్రతి విద్యార్థి తల్లిదండ్రులతో ప్రత్యేక అనుబంధం.
-విశాలమైన తరగతి గదులు-ఆటస్థలం.
-వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక టీచర్....
Thrisandhya, M.Sc
Academic Excutive Director
Gummalla Srinivas M.Tech
Director
SAFE AND SECURE RESIDENTIAL FACILITY FOR BOTH BOYS & GIRLS
(We ensure Hygienic Living Conditions with Food)
SAHASRA A1 SCHOOL
(Nursery to 10th ,Recognized by the Govt.of AP)
KAMEPALLI, JARUGUMALLI (Md).PRAKASAM Dt
Ph: 9000477885, 9000453753